ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విశాఖపట్నం
జిల్లా వార్తలు
గురువారం 23 మే 2024



ఆరోగ్యశ్రీ సేవలు బంద్

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. ప్రభుత్వంతో జరిపిన చర్చలు విఫలం కావడంతో ఈ మేరకు ఆస్పత్రులు యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీ కింద సేవలు పొందుతున్న వారికి చికిత్సలు కొనసాగిస్తామని, కొత్తగా మాత్రం ఎవరినీ చేర్చుకోబోమని నెట్‌వర్క్ ఆస్పత్రులు ప్రకటించాయి. గడిచిన కొన్ని నెలల నుంచి బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించాయి.

చావులమదుం జంక్షన్ వద్ద ఉన్న గెడ్డలో పేరుకుపోయిన చెత్త



గెడ్డలను వదిలేశారు

పూడికతీతపై జీవీఎంసీ నిర్లక్ష్యం

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

గెడ్డలను ఈ ఏడాది జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఏటా వర్షాకాలం ప్రారంభం కావడానికి ముందే గెడ్డల నిర్వహణ పనులు చేపడుతుంటారు. కానీ ఈ ఏడాది ఇంతవరకూ గెడ్డల్లో పూడికతీత పనులకు సంబంధించి టెండర్లు పిలవలేదు. ఎన్నికల కోడ్ పూర్తయ్యేంత వరకూ అందుకు అవకాశం లేదంటున్నారు. ఈలోగా భారీవర్షం పడితే పల్లపు ప్రాంతాలన్నీ నీట మునగడం ఖాయమనే ఆందోళన వ్యక్తమవుతోంది.

- వర్షాకాలంపై సన్నద్ధత ఏదీ?
- ఇప్పటికీ టెండర్లు పిలవని అధికారులు
- వచ్చే నెల నాలుగు వరకూ ఎన్నికల కోడ్ అడ్డంకి
- ఆ తర్వాత ప్రతిపాదనలు తయారుచేసినా కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి
- ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడానికి ముందే దృష్టి పెట్టాల్సింది
- భారీవర్షం కురిస్తే పొంగుతున్న గెడ్డలు...
- పల్లపు ప్రాంతాలు జలమయం

నగరం కొండల మధ్య ఉంటుంది. కొండల పైనుంచి వచ్చే వర్షం నీరు సముద్రంలో కలిసేందుకు వీలుగా భారీగా గెడ్డలు ఉన్నాయి. అయితే కాలక్రమేణా గెడ్డలు ఆక్రమణకు గురవడం, కుంచించుకుపోయాయి. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా నీటి ప్రవాహం సరిగా లేక పొంగి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తుతుంటాయి.

నగరంలో నివాసాలు, వాణిజ్య సముదాయాల్లో రోజువారీ వాడుక నీటిని బయటకు పంపించేందుకు అంతర్గతంగా 4,067 కిలోమీటర్ల పొడవున డ్రైనేజీలు ఉన్నాయి. ఈ డ్రైనేజీల నుంచి కలిసే మురుగు నీటితోపాటు చుట్టుపక్కల కొండల పైనుంచి వచ్చే వర్షం నీటిని నగరం నుంచి బయటకు పంపించేందుకు 47 గెడ్డలు ఉన్నాయి. ఇవి సుమారు 176.86 కిలోమీటర్లు ప్రయాణించి ట్రీట్‌మెంట్ ప్లాంట్‌లలో కొన్ని, నేరుగా సముద్రంలో మరికొన్ని కలుస్తున్నాయి. ఒకప్పుడు విశాలంగా ఉన్న ఈ గెడ్డల పరిరక్షణపై జీవీఎంసీ నిర్లక్ష్యం వహించడంతో ఆక్రమణలు పెరిగి బక్కచిక్కిపోయాయి. దీంతో ఒక మోస్తరు వర్షం కురిసినా గెడ్డలు పొంగి పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు చేరిపోతోంది. గత ఏడాది ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీ పరిధిలో వరద నీటి జోన్లు	15
జీవీఎంసీ పరిధిలో గెడ్డలు	47
పొడవు	176.86 కిలోమీటర్లు
అంతర్గత డ్రైన్ల పొడవు	4,067 కిలోమీటర్లు

థియేటర్లు వెలవెల

వేసవిలోనూ కానరాని ప్రేక్షకులు

- ఐదు శాతం కూడా నమోదుకాని ఆక్యుపెన్సీ
- పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం, ఎన్నికలు, ఐపీఎల్ కారణమంటున్న యజమానులు
- మరోవైపు తీవ్రంగా దెబ్బతీస్తున్న ఓటీటీ ప్లాట్‌ఫాం
- తెలంగాణలో ఇప్పటికే సింగిల్ స్క్రీన్ థియేటర్ల మూత



ప్రేక్షకులు లేక వెలవెలబోతున్న నగరంలోని సంగం శరత్ థియేటర్

డాబాగార్డెన్స్, మే 22:

ఒకప్పుడు థియేటర్‌లో సినిమా చూడాలంటే... ఆన్‌లైన్‌లో కనీసం రెండు, మూడు రోజుల ముందు టికెట్లు బుక్ చేసుకోవాల్సిన పరిస్థితి ఉండేది. లేదంటే...షో సమయానికి రెండు, మూడు గంటల ముందుగా క్యూలో నిల్చోవాల్సి వచ్చేది. ఇక వేసవి వచ్చిందంటే చాలు...థియేటర్లకు పండగే. సెలవులు ప్రారంభం నుంచి తిరిగి పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభమయ్యే వరకు సినిమాహాళ్లు కిక్కిరిసిపోయేవి. అయితే కాలక్రమేణా ప్రేక్షకులు సినిమా థియేటర్‌లకు దూరమవుతున్నారు. తీవ్రమైన ఒత్తిడితో కూడిన జీవనం, అందుబాటులోకి ఓటీటీ ప్లాట్‌ఫాంలు రావడం తదితర అంశాలు సగటు ప్రేక్షకుడిని థియేటర్‌కు దూరం చేస్తున్నాయి.

ఈ ఏడాది వేసవిలోనూ థియేటర్లు వెలవెలబోతున్నాయి. కనీసం ఐదు శాతం ఆక్యుపెన్సీ కూడా లేకుండానే షోలను ప్రదర్శించాల్సిన దుస్థితిలో యాజమాన్యాలు ఉన్నాయి. వేసవి ఆరంభం నుంచీ ఈ పరిస్థితి కొనసాగడానికి ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్ కారణమని అంచనా వేస్తున్నారు. అదీ కాకుండా పెద్ద హీరోల సినిమాలేవీ విడుదల కాకపోవడం కూడా థియేటర్ల వద్ద జనం కనిపించకపోవడానికి కారణమంటున్నారు. మంచి సినిమా అని టాక్ వచ్చేంత వరకు సినిమా హాళ్లకు ప్రేక్షకులు దూరంగా ఉంటున్నారని, వచ్చిన ఒకటి, రెండు సినిమాలు కూడా అంతగా ఆకట్టుకోకపోవడంతో హాళ్లు నిండని పరిస్థితి నెలకొందంటున్నారు. జనం రాకపోవడంతో తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ థియేటర్లు ఇప్పటికే మూతపడ్డాయని చెబుతున్నారు.



ఖాళీగా ఉన్న జగదాంబ సెంటర్‌లోని మెలోడీ థియేటర్

దారుణంగా తగ్గిన ఆక్యుపెన్సీ

ఈ ఏడాది సంక్రాంతి పండగ సమయంలో విడుదలైన పెద్ద సినిమాలు గుంటూరు కారం, డీజే టిల్లు స్క్వేర్, హనుమాన్ బాక్సాఫీసుల వద్ద కనకవర్షం కురిపించాయి. ఆ తరువాత ఆ స్థాయి సినిమాలు విడుదల కాకపోవడం, వచ్చిన చిన్న సినిమాలు ప్రేక్షకుల ఆదరణకు నోచుకోకపోవడంతో థియేటర్‌లు ఖాళీగానే దర్శనమిస్తున్నాయి. సుమారు నాలుగు నెలలుగా రాష్ట్రంలో ఇదే పరిస్థితి కొనసాగుతున్నది.

సొంతంగా థియేటర్ ఉంటేనే...

విశాఖ పరిసర ప్రాంతాల్లో కొందరికి సొంతంగా థియేటర్‌లు ఉన్నాయి. దీంతో వారు అందులో పనిచేస్తున్న సిబ్బంది కోసం, పేషన్‌తో మరికొందరు థియేటర్‌లను నడుపుతున్నారు. వారే యజమానులు కావడంతో నష్టాలను భరిస్తూ ఏ సినిమా వచ్చినా ధైర్యంగా రిలీజ్ చేస్తున్నారు. అదే అద్దెకు తీసుకున్న వారు ఈ సాహసం చేయడం లేదు. పాత సినిమాలనే మళ్లీ ప్రదర్శించడం ద్వారా ఆర్థికంగా నష్టపోవడం మినహా ప్రయోజనం లేదని వెనకడుగు వేస్తున్నారు.

రీరిలీజ్‌తో దయనీయం

ఇటీవల రీరిలీజ్ పేరుతో పాత సినిమాలను..అప్పట్లో సూపర్‌హిట్ అయిన సినిమాలను మళ్లీ ప్రదర్శిస్తున్నారు. అభిమాన హీరోల సినిమా కావడంతో ఆ ఒక్క షో చూసేందుకు జనం థియేటర్‌కు వస్తున్నారు. మూడు రోజులు అదే సినిమా ప్రదర్శిస్తే ప్రేక్షకులు ... మిగతా 6వ పేజీలో



పన్నెండు రకాల కాయలు కలిగిన మామిడి చెట్టు

ఒకే చెట్టుకు 12 రకాల మామిడి కాయలు

పద్మనాభం, మే 22: విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం బాందేవుపురం గ్రామంలో మాజీ సర్పంచ్ సాగి కృష్ణమూర్తిరాజు ఇంటి పెరటిలో ఉన్న మామిడి చెట్టుకు 12 రకాల కాయలు కాశాయి. రైతు అయిన ఆయన తన పొలాల్లో పలు రకాల మామిడి చెట్లు పెంచుతున్నారు. ఒకే చెట్టుకు అంటు కట్టే విధానంలో పలు రకాల మామిడి కాయలు కాచేవిధంగా చేస్తే ఎలా ఉంటుందని ఆలోచించి, 12 ఏళ్ల క్రితం తన ఇంటి ఆవరణలో పరియా మామిడి మొక్క వేశారు. ఆ మొక్కకు ఏడేళ్ల క్రితం ఏకంగా 12 రకాల అంట్లు కట్టించారు. ఈ విధంగా కట్టించిన అంట్లు సత్ఫలితాలు ఇవ్వడంతో ఆ చెట్టుకు పన్నూరు మామిడి, ఇమాపసంద్, చెరుకు రసాలు, సువర్ణ కలశ, బంగినపల్లి, దొండకాయ, సువర్ణ రేఖ, కొత్తపల్లి కొబ్బరి, దశేరి తదితర రకాల కాయలు కాస్తున్నాయి. తన ఇంట్లో వినియోగించుకోవడానికి ఈ చెట్టుకు ఈ విధంగా అంట్లు కట్టించినట్టు రైతు కృష్ణమూర్తిరాజు తెలిపారు.

జగనన్న కాలనీలో రోడ్లు తవ్వేశారు



పైడివాడ అగ్రహారం జగనన్న కాలనీ లేఅవుట్‌లో రోడ్లు తవ్వేసి బేస్‌మెంట్లు ఫిల్లింగ్ చేసిన దృశ్యం

సబ్బవరం, మే 22:

జగనన్న కాలనీలో ఇళ్ల బేస్‌మెంట్ ఫిల్లింగ్‌కు అక్కడి రోడ్లనే తవ్వేసి వినియోగిస్తున్న విచిత్ర పరిస్థితి మండలంలోని పైడివాడ అగ్రహారంలో కనిపించింది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సబ్ కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

ఆ మట్టితో బేస్‌మెంట్ల ఫిల్లింగ్

- ఇష్టానుసారంగా వ్యవహరించిన సబ్ కాంట్రాక్టర్
- అధికారుల మొద్దు నిద్ర
- నెల రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా పట్టించుకోని వైనం

విశాఖ నగరంలో గల పేదల కోసం వీఎంఆర్‌డీఏ సబ్బవరం మండలం పైడివాడ, పైడివాడ అగ్రహారం, ఎరుకునాయుడుపాలెం గ్రామాల పరిధిలో సుమారు 320 ఎకరాలు సమీకరించి జగనన్న కాలనీలకు లేఅవుట్లు వేసింది. ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు రాక్రీట్ ఇన్‌ఫ్రా సంస్థ కాంట్రాక్ట్ తీసుకుంది. అయితే ఆ సంస్థ గ్రావెల్ లేదా మట్టితో బేస్‌మెంట్ల ఫిల్లింగ్‌కు వేరొకరికి సబ్ కాంట్రాక్టు ఇచ్చింది. లేఅవుట్‌ను ఆనుకుని ఉన్న కొండ నుంచి గ్రావెల్ తవ్వి ఒక్కో బేస్‌మెంట్ ఫిల్లింగ్‌కు రూ.1500కు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. అయితే సబ్ కాంట్రాక్టర్ పని ప్రారంభించిన తరువాత రూ.1500లు గిట్టుబాటు కావడం లేదని ఎక్స్‌కవేటర్లతో ... మిగతా 6వ పేజీలో

క్లాప్ కార్మికులకు అందని వేతనాలు

మూడు నెలల కిందట విధుల్లోకి 650 మంది...

- రోజుకు రూ.450 చొప్పున ఇచ్చేందుకు జీవీఎంసీ అంగీకారం
- టెండర్ ద్వారా కాంట్రాక్టర్ ఎంపిక
- జీతాలు చెల్లించని సదరు కాంట్రాక్టర్
- తమకు సంబంధం లేదంటున్న అధికారులు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) వాహనాలతో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించే కార్మికులకు గత మూడు నెలలుగా వేతనాలు అందడం లేదు. అయినప్పటికీ వారిని విధుల్లోకి తీసుకున్న కాంట్రాక్టర్ గానీ జీవీఎంసీ అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. జీవీఎంసీ పరిధిలో ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించేందుకు సచివాలయానికి ఒకటి చొప్పున 650 వాహనాలను కేటాయించారు. వాహనంతోపాటు డ్రైవర్‌ను సమకూర్చినందుకు కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ నెలకు రూ.65 వేలు చొప్పున చెల్లిస్తోంది. వాహనంతోపాటు ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేందుకు జీవీఎంసీకి చెందిన ప్రజారోగ్య విభాగం అధికారులు అవుట్‌సోర్సింగ్‌లో పారిశుధ్య కార్మికులను నియమించుకున్నారు. ఒక్కో వాహనం వెంట ఇద్దరిని లోడర్లుగా పంపించారు. అయితే నగరంలో పారిశుధ్య నిర్వహణకు సిబ్బంది కొరత ఏర్పడడంతో క్లాప్ వాహనాలతో లోడర్లుగా వెళుతున్న కార్మికులను అధికారులు వెనక్కి రప్పించారు. వారి స్థానంలో ఒక్కో వాహనానికి ఒక కార్మికుడు లోడర్‌గా ఉండేలా 650 మంది కార్మికులను రోజువారీ కూలీ ప్రాతిపదికన తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు రోజుకు రూ.450 చొప్పున చెల్లించేలా 650 మంది కార్మికులను జీవీఎంసీకి సరఫరా చేసేందుకు టెండర్ పిలిచారు. టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ మూడు నెలల కిందట కార్మికులను జీవీఎంసీకి అప్పగించారు. వారంతా క్లాప్ వాహనాల వెంట ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి వాహనాల్లో వేస్తున్నారు. అయితే వీరికి మూడు నెలలుగా జీతం చెల్లించడం లేదు. దీనిపై కార్మికులు జీవీఎంసీ అధికారులను కలిసి సమస్యను వివరిస్తే తమకు కాంట్రాక్టర్ ఇంకా బిల్లు పెట్టలేదని సమాధానం ఇస్తున్నారు. జీవీఎంసీ బిల్లుతో సంబంధం లేకుండా కార్మికులకు నెల పూర్తయ్యేసరికి కాంట్రాక్టరే వేతనాలను చెల్లించి, తర్వాత జీవీఎంసీ నుంచి రాబట్టుకోవాలి. కానీ కాంట్రాక్టర్ మాత్రం జీవీఎంసీ బిల్లు ఇచ్చేంత వరకూ తాను ఇచ్చేది లేదంటూ చేతులెత్తేసినట్టు కార్మికులు వాపోతున్నారు. మూడు నెలలుగా వేతనాలు అందకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని కార్మికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

రోజువారీ కూలీ ఉద్యోగాలకు రూ.50 వేలు వరకూ వసూలు

క్లాప్ వాహనాల్లోకి చెత్తను లోడ్ చేసేందుకు రోజువారీ కూలీ ప్రాతిపదికపై విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు కాంట్రాక్టర్‌తోపాటు ... మిగతా 6వ పేజీలో



బుధవారం ఉదయం 9.30 గంటల వరకూ విశాఖ స్టేషన్‌లోనే ఉండిపోయిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్

‘జన్మభూమి’ 3 గంటలు ఆలస్యం

విశాఖ నుంచి బయలుదేరిన కొద్దిసేపటికే లింక్ తెగిన బోగీలు

- మళ్లీ స్టేషన్‌కు వచ్చిన రైలు.. ప్రత్యామ్నాయం ఏర్పాటు చేశాక ప్రయాణం
- ఇతర రైళ్ల రద్దుతో విపరీతమైన రద్దీ

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి లింగంపల్లి వెళ్లాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైలు (12805) బుధవారం ఉదయం మూడు గంటల ఆలస్యంగా బయలుదేరింది. ఈ రైలును ఉదయం 6.20 గంటలకు సరైన సమయానికే తీసినప్పటికీ స్టేషన్ దాటిన రెండు నిమిషాలకే రెండు బోగీలు (ఎం-1, డీ-1) సాంకేతిక కారణాలతో లింక్‌లు తెగిపోయినట్టు గుర్తించి వెంటనే వెనక్కి తీసుకువచ్చారు. ఆ తరువాత వాటిని మార్చి, వేరే బోగీలను రప్పించి రైలును పంపించేసరికి ఉదయం 9.30 గంటలు అయింది. రైలు వెనక్కి రావడం, స్టేషన్‌లో మూడు గంటలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధిలో నిర్వహణ పనులు జరుగుతున్నాయనే కారణంతో విశాఖపట్నం-విజయవాడల మధ్య అనేక రైళ్లు రద్దు చేశారు. దాంతో ఇక్కడి నుంచి కాకినాడ, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ ప్రాంతాలకు వెళ్లాల్సిన వారంతా జన్మభూమినే ఆశ్రయిస్తున్నారు. వేసవి సెలవులు కావడం, ఇతర రైళ్లు రద్దు కావడంతో ... మిగతా 6వ పేజీలో

కౌంటింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు

ఆర్వోలకు కలెక్టర్ మల్లికార్జున ఆదేశాలు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో వచ్చే నెల నాలుగో తేదీన జరగనున్న ఓట్ల లెక్కింపునకు ఏర్పాట్లు పక్కాగా చేయాలని నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టరు ఎ.మల్లికార్జున ఆదేశించారు. పొరపాట్లు జరిగితే ఆర్వోలదే బాధ్యత అని స్పష్టంచేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆర్వోలు, ఏఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్ల లెక్కింపు సమయంలో ఆర్వోలు అత్యంత జాగ్రత్తగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి కౌంటింగ్ వివరాలు చెప్పడంతోపాటు వారిలో ఉండే అపోహలు తొలగించాలన్నారు. లెక్కింపు కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, బారికేడ్లు, హాలులో టేబుళ్ల ఏర్పాటుతోపాటు అభ్యర్థుల తరపున ఏజెంట్లకు గుర్తింపు కార్డుల జారీపై దృష్టిపెట్టాన్నారు. నెలాఖరులోగా ఏర్పాట్లన్నీ పూర్తిచేయాలని ఆదేశించారు. పబ్లిక్ కమ్యూనికేషన్ రూమ్, సెల్‌ఫోన్లు భద్రపరిచే సెంటర్, వాహనాల పార్కింగ్‌కు సంబంధించి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపులో పాల్గొననున్న సిబ్బందికి తొలి ర్యాండమైజేషన్ ఈనెల 29న, రెండోది వచ్చే నెల రెండో తేదీన జరుగుతుందని పేర్కొన్నారు. కౌంటింగ్ సిబ్బందికి ఈనెల 27వ తేదీన శిక్షణ ఉంటుందన్నారు. సమావేశంలో జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత వర్మ, అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డీఆర్వో కె.మోహన్‌కుమార్, ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

కథలకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లు



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట, మే 22: సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కథాకచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ తెలుగు సాహిత్యం పై మాట్లాడారు. కథలు మానవ సంబంధాల సంక్లిష్టను తెలియజేస్తామన్నారు. మాన విలువలు, సామాజిక సమస్యలను పరిష్కారానికి, విశ్లేషించడానికి దోహదం చేస్తాయన్నారు. తొలుతనుంచి ఉత్తమ విలువలతో కూడిన కథలు ఉత్తరాంధ్ర నుంచి వచ్చాయన్నారు. వీటిని చదివి వర్తమాన రచయితలు స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ వేణు, డాక్టర్ జీవీ సూర్యారావు, డాక్టర్ సూరపనేని విజయకుమార్, చిన సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణకు సమాజ భాగస్వామ్యం అవసరం

- తూర్పు కనుముల్లో జీవ వైవిధ్యంపై పరిశోధనలు సాగాలి
- పురాతన సంప్రదాయ జీవన విధానాలు భావితరాలకు అందివ్వాలి
- రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి



ప్రసంగిస్తున్న చిరంజీవి చౌదరి. వేదికపై ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, జాతీయ జీవ వైవిధ్య మండలి ప్రతినిధి ఆచార్య రాయప్ప, తదితరులు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడతో ముడిపడి ఉన్న జీవ వైవిధ్యం పరిరక్షణలో సమాజ భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి అన్నారు. ఆ దిశగా అడుగులు పడితేనే 2030 నాటికి అన్ని రంగాలకు సుస్థిరమైన పర్యావరణ ఫలాలు అందుతాయన్నారు. ఆ దిశగా రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ప్రణాళికలు రూపొందించి అమలు కోసం పనిచేస్తోందన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏయూ కన్వెన్షన్ హాలులో బుధవారం జాతీయ స్థాయి జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి చౌదరి మాట్లాడుతూ సుస్థిర పద్ధతిలో ఫలాలు అందాలంటే ఒకటి...జీవ వైవిధ్య పరిరక్షణ, రెండోది...ప్రకృతిలో లభ్యమయ్యే జీవ వనరుల స్థిరమైన వినియోగం, మూడోది...జీవ వనరుల ద్వారా వచ్చే ఫలాలు వాటాదారులకు సమంగా అందాలన్నారు. తీవ్రమైన విపత్తులు, కరువు, మడ అడవుల నరికివేత, వనరుల విధ్వంసం వంటి కారణాలతో వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వాతావరణ మార్పులతో జీవ వైవిధ్యానికి కలిగే దుష్పరిణామాలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో జీవ వైవిధ్య మండళ్లు కృషిచేయాలన్నారు. గ్రామాలు, అడవుల్లో నివసిస్తున్నవారు ఆచరించే పురాతన సంప్రదాయ విధానాలను ఆధునికత జోడించి భావితరాలకు అందించాలన్నారు. జీవవైవిధ్యం పరిరక్షణకు విద్యా రంగంలో సంస్కరణలు రావాలని కోరారు. పశ్చిమ కనుములతో పోల్చితే తూర్పు కనుముల్లో జీవవైవిధ్యం విశిష్టత తెలియడానికి విస్తృతమైన పరిశోధనలు జరగాలన్నారు. విశాఖపట్నంలో అటవీ శాఖ అధికారి అనంతశంకర్ జీవ వైవిధ్యంపై ఒక పార్కు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వర్సిటీలో జీవ వైవిధ్య పరిరక్షణకు సంబంధించి అన్నిరకాల కార్యకలాపాలు చేపడుతున్నామన్నారు. దేశంలో గుర్తింపుపొందిన రెండు గ్రీన్ విశ్వవిద్యాలయాల్లో ఏయూ ఒకటన్నారు. వర్సిటీ బోటనీ విభాగానికి సమీపంలో 10 ఎకరాల్లో బయో డైవర్సిటీ పార్కును ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు విశాఖలో స్వచ్ఛంద సంస్థలు, మీడియా ఇచ్చిన ప్రాధాన్యం గుర్తుచేసుకుంటూ సముద్రానికి అభిముఖంగా కన్వెన్షన్ హాలును తాబేలు ఆకారంలో నిర్మించామన్నారు. జాతీయ జీవ వైవిధ్య మండలి ప్రతినిధి ఆచార్య రాయప్ప రామప్ప మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరికీ ఆహారం అందించాలంటే పురాతన వంగడాలు కొనసాగేందుకు జీవ వైవిధ్యం పాత్ర కీలకమన్నారు. రైతులు, గిరిజనులకు వ్యవసాయం ద్వారా మెరుగైన ఆదాయం వచ్చేలా జీవ వైవిధ్య మండళ్లు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. వైఎస్సార్ ఉద్యానవన వర్సిటీ ఉపకులపతి ఆచార్య జానకిరామ్ మాట్లాడుతూ పట్టణీకరణ, అడవుల నరికివేత, కాలుష్యం పెరగడం వంటి కారణాలతో జీవ వైవిధ్యానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. రైతులు ఆహార పంటలతోపాటు కూరగాయలు, ఉద్యానవన పంటలు సంప్రదాయ బద్ధంగా పండించేలా జీవవైవిధ్య మండళ్లు కృషిచేయాలన్నారు. రాష్ట్ర జీవవైవిధ్య మండలి సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి జీవవైవిధ్య పరిరక్షణకు మండలి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అటవీ శాఖ విశాఖ సీసీఎఫ్ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి మాట్లాడుతూ తూర్పు కనుముల్లో ఎంతో విశిష్టమైన జీవవైవిధ్యం ఉందని పేర్కొంటూ వాటిని పరిరక్షించాలన్నారు. విశాఖ నుంచి భీమిలి తీరంలో మానవ కార్యకలాపాల వల్ల సముద్ర తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు ఇబ్బంది కలుగుతుందని, తమ శాఖ కొన్నిచోట్ల నెస్ట్‌లు ఏర్పాటుచేసిందన్నారు. కార్యక్రమంలో వివిధ రకాల పుస్తకాలు, బ్రోచర్లు ఆవిష్కరించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డీఎఫ్‌వో అనంతశంకర్, జూ క్యూరేటర్ నందిని సలారియా, రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అటవీ శాఖ అధికారులు, ఏడు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

27 నుంచి పాలిసెట్ దరఖాస్తుల పరిశీలన

కంచరపాలెం, మే 22 : పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలిసెట్-2024)లో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ప్రారంభించడానికి సాంకేతిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పాలిసెట్ కౌన్సెలింగ్‌నకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సాంకేతిక శాఖ కమిషనర్ బుధవారం విడుదల చేశారు. దీని ప్రకారం ర్యాంకర్లు మే 24 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్ పేమెంట్ చేసుకోవచ్చు. ధ్రువపత్రాల పరిశీలనమే 27వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు కంచరపాలెంలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రాల వద్ద నిర్వహిస్తారు. ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ సాయంకాలం 5 గంటల వరకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వొచ్చు. జూన్ 5న ఆప్షన్లలో మార్పులు చేసుకునే వీలుంటుంది.జూన్ 7న సీట్ల కేటాయింపు జరగనున్నది. వచ్చేనెల 10వ తేదీ నుంచి పాలిటెక్నిక్ మొదటి ఏడాది తరగతులు ప్రారంభమవుతాయి.

నేడు అప్పన్నకు రెండో విడత చందన సమర్పణ

సింహాచలం, మే 22: వరాహలక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండో విడత చందనం సమర్పించనున్నారు. ఈనెల 18 నుంచి నాలుగు రోజుల పాటు అరగదీసిన చందనపు ముద్దలో బుధవారం 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళితం చేసి పద్మనిధిలో భద్రపరిచారు. దానిని గురువారం వేకువజామున సుప్రభాత సేవ తరువాత అర్చకులు స్వామివారికి పైపూతగా సమర్పించనున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేసిన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత శనివారం భక్తుల రద్దీతో ఘాట్‌రోడ్డులో తలెత్తిన ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా భక్తులు తమ వాహనాలను కొండదిగువనే విడిచిపెట్ట దేవస్థానం, ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి రావాలని ఈవో కోరారు.

అధికార పార్టీ దౌర్జన్యాలను అరికట్టాలి

- టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు



ఎన్టీఆర్ విగ్రహం ఎదుట న్యాయవాదులు

మహారాణిపేట, మే 22: అధికార వైసీపీ చేస్తున్న దౌర్జన్యాలు, కుట్రలను అధిగమించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం నగర పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన లీగల్ సెల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల జరిగిన అనంతరం జూన్ 4వతేదీన జరగనున్న కౌంటింగ్ సమయంలో న్యాయవాదులు అందించాల్సిన సహాయసహకారాలపై చర్చించారు. ఎన్నికల్లో లీగల్ సెల్ న్యాయవాదుల కూటమి అభ్యర్థుల విషయంలో క్రియాశీలక పాత్రవహిస్తు విశేషసేవలు అందించారని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు బి రా జశేఖర్, పీఎస్ నాయుడు, వెన్నెల ఈశ్వ రరావు, పతివాడ గిరిధర్, ఉమా శంకర్, శ్రీధర్, మణికంఠ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే జీవకోటి మనుగడ

- కృష్ణా విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి రామకృష్ణారావు

సీతంపేట, మే 2: జీవ వైవిధ్య ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కృష్ణా విశ్వ విద్యాలయం విశ్రాంత ఉప కులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫేమ్‌వర్క్ అమలుకు మద్దతు ఇవ్వడం ద్వారా జీవ వైవిధ్య నష్టాన్ని నివారణకు వీలవుతుందన్నారు. జీవవైవిధ్యంతోనే జీవకోటి మ నుగుడ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచే కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ప్రభుత్వాలు స్థానిక ప్రజలు, స్థానిక కమ్యూనిటీలు, ప్రభుత్వేతర సంస్థలు, చట్టసభ సభ్యులు, వ్యాపారులు, వ్యక్తులు జీవ వైవిధ్య ప్రణాళిక అమలకు మద్దతు నిచ్చే మార్గాలను మెరుగుపరచడానికి ప్రోత్సహించాలన్నారు. ఏవీఎస్ డిగ్రీ కాలేజ్ జువాలజీ లెక్చరర్ అర్చన మాట్లాడుతూ, సముద్రం మన భవిష్యత్తు ఆహార కేంద్రం అన్నారు. అలాంటి సముద్ర జీవరాశిని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. నడుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాచకొండ శ్రీనివాస్, సిఫా ట్రస్ట్ సీఈఓ డాక్టర్ శశిప్రభ, యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్‌లు జీవ వైవిధ్య పరిరక్షణపై పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ గార్డినింగ్ ప్రతినిధులు ఉదయ్‌కుమార్, మళ్ల సరిత, యువ సేన సంస్థ ప్రతినిధి హరి, పీపుల్స్ పవర్ సంస్థ ప్రతినిధి భాస్కర్, ఉపాధ్యాయురాలు పంతులు లలిత, ఎస్ఎఫ్ఎస్ విద్యా సంస్థ ఉపాధ్యాయులు శివ లక్ష్మి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధులు కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకరి రామకృష్ణారావు

నేలబావిలో పడి ఒకరి మృతి



శివాజీకుమార్ మృతదేహం

దత్తిరాజేరు, మే 22: స్నేహితుడి గ్రామంలో పండగకు వెళ్లిన ఓ వ్యక్తి.. ప్రమాదవశాత్తు నేలబావిలో పడి ప్రాణా లు కోల్పోయాడు. ఈ సంఘటన విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం రాజులపేటలో బుధవారం జరిగింది. పెదమానాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆర్టీసీలో పనిచేస్తున్న విశాఖలోని నక్కవానిపాలేనికి చెందిన కునుచర్ల శివాజీకు మార్ (60) స్నేహితులతో కలిసి విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం చినకాద పంచాయతీ రాజులపేటకు చెందిన బుద్ధ రమేష్‌రాజు ఆహ్వానం మేరకు గ్రామ దేవత పండగకు మంగళవారం వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం భోజనం చేసి శివాజీకుమార్ బహిర్భూమి కోసం బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకూ రాకపోవడంతో రమేష్‌రాజు, స్నేహితులు వెతికారు. గ్రామ సమీపంలోని నేలబావి వద్ద దుస్తులు, షూ కనిపించడంతో బావిలో పరిశీలించగా శివాజీకుమార్ మృతదేహం కనిపించింది. స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. శివాజీకుమార్‌కు భార్య శారదాదేవి, కుమా రుడు భార్గవరాజు ఉన్నారు. మృతదేహానికి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్గవరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు

జ్ఞానాపురం, మే 22: అచ్చియ్యమ్మపేట గ్రామదేవత ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం హుండీ లెక్కంపు బుధవారం దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీహరిసేవ సంఘం సహకారంతో జరిగింది. మార్చి 18నుంచి మే 22 వరకు మొత్తం 65రోజులకు గాను హుండీల ద్వారా రూ. 27,01,011 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు. ఏపీజీవి బ్యాంక్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చార్కోల్‌తో అప్పన్న చిత్తరువు



చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్ దంపతులు

సింహాచలం, మే 22: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చార్కోల్‌తో సింహాద్రినాథుని చిత్తరువును రూపొం దించారు. ఇప్పటివరకు మిలెట్స్‌తో పలు రకాల చిత్రాలను రూపొందించిన ఆయన ఈనెల 10న జరిగిన చందనోత్సవం తరువాత అప్పన్నస్వామి నిజరూపం, నిత్య రూపాల మేలు కలయికతో చిత్రాన్ని తయారు చేయాలని నిర్ణయించుకుని, ఐదు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు కలిగిన చిత్రాన్ని రూపొందించారు. దానిని దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతుల చేతుల మీదుగా బుధవారం సింహగిరిపై ఆవిష్కరించారు. చిత్రపటాన్ని ఎల్లప్పుడు భక్తులకు కనిపించే స్థలంలో దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేయాలని విజయ్‌కుమార్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసమూర్తి, ఈఈ బండారు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిపై దాడి

- కేసు నమోదులో పోలీసుల తాత్సారం

ఎంవీపీ కాలనీ, మే 22 : పాత గొడవల నేపథ్యంలో ఒక వర్గం వారు ఇండిపెండెంట్ అభ్యర్థిపై దాడి చేశారు. దాడికి గురైన వ్యక్తి ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎంపీ సీటుకు పోటీ చేశారు. 22 వార్డు కార్పొరేటరు, జనసేన నాయకుడు మూర్తి యాదవ్‌తో విభేదాలు దృష్ట్యా ప్రస్తుతం జరిగిన దాడి ప్రాధాన్యత సంతరించుకుంది. శివాజీపాలెం దరి మంగాపురం కాలనీలో ఉంటున్న దేవర శంకర్, అతడి సోదరుడు జనసేనలో తిరిగేవారు. పలు అంశాల్లో అదే వార్డులో కార్పొరేటరుగా ఉంటున్న మూర్తి యాదవ్‌కు వారికి విభేదాలు ఉన్నాయి. తనపై సోషల్ మీడియాలో పలు పోస్టులు పెట్టినట్టు మూర్తి యాదవ్ కొద్దిరోజుల క్రితం వారిపై సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం మూర్తి యాదవ్ అనుచరులు శంకర్ ఇంటికి వెళ్లి, అతిడితో వాగ్వాదానికి దిగారు. అనంతరం దాడి చేయడంతో, శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి పది గంటల వరకూ సమాచారం ఇవ్వడంలో పోలీసులు గోప్యత పాటించడం పలు అనుమానాలకు తావిచ్చింది. మరోపక్క ఈ గొడవను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వైసీపీ ప్రయత్నించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసు నమోదు చేయాలంటూ కొందరు, వద్దని మరికొందరు పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతో నాన్చుడు ధోరణి అవలంబించారు. ఎట్టకేలకు చినవాల్తేరుకు చెందిన బోగ రవిశంకర్, మంగాపురం కాలనీకి చెందిన కొయ్య రామకృష్ణ, గొలగాని స్వామి అనే ముగ్గురిపై సెక్షన్ 324 ప్రకారం కేసు నమోదు చేసినట్టు సీఐ సంజీవరావు తెలిపారు.

సర్వే ఫలితాలన్నీ ఏకపక్షమే..

- రాష్ట్రంలో కూటమిదే విజయం.. మాజీ మంత్రి గంటా



మాట్లాడుతున్న గంటా. పక్కన సోమిరెడ్డి, రఘురామకృష్ణంరాజు తదితరులు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికలపై సర్వే సంస్థల ఫలితాలన్నీ ఏకపక్షంగానే ఉన్నాయని, కూటమిదే విజయమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని తన స్వగృహంలో బుధవారం కూటమి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రఘురామకృష్ణ రాజులతో కలిసి ఆయన మాట్లాడారు. జూన్ 4న వచ్చే ఫలితాలు చూసి జగన్‌మోహన్‌రెడ్డి షాక్‌కు గురికావడం తథ్యమన్నారు. పోలింగ్ సరళి అంతా ఏకపక్షంగా జరిగినట్టు తెలిసిపోతున్నదన్నారు. హైదరాబాద్, బెంగళూరుల నుంచి ఓటర్ల తాకిడి సంక్రాంతి రాకపోకలను తలపించిందన్నారు. మాచర్ల, పల్నాడు, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న దాడులు వైసీపీ నాయకుల నిరాశ, నిస్పృహలను తెలియజేస్తున్నదన్నారు. ఓడిపోతున్నామని తెలిసినా సరే విశాఖలో జూన్ 9న జగన్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు అంటూ ఆ పార్టీ నాయకులు మాట్లాడడంపై జనం నవ్వుకుంటున్నారన్నారు. సమావేశంలో పాల్గొన్న నాయకులంతా విష్ణుకుమార్ రాజుతో సహా అసెంబ్లీలో కాలు పెట్టడం ఖాయమన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తం: కలెక్టర్

మహారాణిపేట, మే 22: ఆంధ్రా యూనివర్సిటీ ఇంజ నీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈవీఎమ్‌ల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కల్పించిన భద్రతా చర్యల ను జిల్లా కలెక్టర్ ఏ మల్లికా ర్జున బుధవారం పరిశీలిం చారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా సిబ్బందిని అప్ర మత్తంగా ఉండాలని సూచించారు ఈ కార్య క్రమంలో జాయింట్ పోలీసు కమిషనర్ పకీరప్ప, జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లు వెలవెల

... 5వ పేజీ తరువాయి

కనిపించడం లేదు. ఫలితంగా మరింత నష్టపోతున్నామని యాజమాన్యాలు వాపోతున్నాయి. ఇలంటి హిట్ సినిమాలన్నీ ఇప్పటికే పలుమార్లు టీవీ చానళ్లలో వచ్చేసినవేనని, దీంతో థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసం ప్రేక్షకులు రావడం లేదంటున్నారు.

టికెట్ ధరలతో బెంబేలు

థియేటర్లలో టికెట్ ధరలు సగటు ప్రేక్షకుడికి భారంగా మారిపోయాయి. గతంలో ఒక్కో థియేటర్‌లో కనీసం నాలుగైదు క్లాసులుండేవి. తక్కువ ధరకు టికెట్ లభిస్తుండడంతో సామాన్య ప్రేక్షకుల ఆదరణ లభించేది. కానీ ప్రస్తుతం అధికశాతం థియేటర్లలో రెండు క్లాసులకే పరిమితమవుతోంది. అదీ ధర ఎక్కువగా ఉండడంతో రోజు కూలీలు, ఇతర సామాన్యులు థియేటర్ వైపు రావడం లేదు. గతంలో మాదిరిగా ఎక్కువ క్లాసులు అందుబాటులోకి వస్తే ఏడాది పొడవునా థియేటర్లు కళకళలాడుతాయని అంచనా వేస్తున్నారు.

ఓటీటీ ప్రభావం

థియేటర్‌కు జనం రాకపోవడానికి ఓటీటీ ప్లాట్‌ఫాంలు కూడా మరో కారణంగా భావిస్తున్నారు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ టీవీలు అందుబాటులోకి రావడం, పెద్దపెద్ద టీవీలు కూడా సామాన్యులు భరించే ధరలకు విక్రయిస్తుండడం, హోం థియేటర్ల ప్రభావం...థియేటర్‌లకు జనం దూరమవడానికి కారణమని చెబుతున్నారు. పైగా థియేటర్‌కు వెళ్లే టికెట్ ధరలతో పాటు ఇంటర్‌వెల్‌లో ఖర్చు భారంగా మారుతోందని సగటు ప్రేక్షకుడు వాపోతున్నాడు. ఈ ఏడాది వేసవిలో థియేటర్లన్నీ ఖాళీగా మారడానికి నాలుగు అంశాలు కీలకంగా మారాయని యాజమాన్య ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం, తీవ్రమైన ఎండల కారణంగా జనం రావడం లేదంటున్నారు. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ చాలామంది ఓటీటీలో చూద్దామనే భావనలో ఉన్నారంటున్నారు.

థియేటర్లు కళ తప్పాయి

వేసవిలో ఎప్పుడూ థియేటర్‌లు కళకళలాడేవి. ఈసారి సార్వత్రిక ఎన్నికలు, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం థియేటర్లు కళ తప్పడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కనీసం ఐదు నుంచి ఏడు శాతం కూడా ఆక్యుపెన్సీ రావడం లేదు. అయినప్పటికీ కొంతమంది థియేటర్‌లు నడుపుతున్నారు. మరికొంతమంది థియేటర్ మరమ్మతులు చేయిస్తుండగా, ఇంకొంతమంది థియేటర్‌లను అమ్మేశారు. పెద్ద హీరోల సినిమాలు విడుదలయ్యేంత వరకు ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

- రమణ, మేనేజర్, మెలోడి థియేటర్

గెడ్డలను వదిలేశారు

... 5వ పేజీ తరువాయి

నాలుగు రోజులపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో గెడ్డలు పొంగిపోయాయి. దీనివల్ల వన్‌టౌన్ ప్రాంతం మునిగిపోయింది. అధికారులు ముందుజాగ్రత్తగా పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించారు. మరో రెండు, మూడు వారాల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. రుతుపవనాల సీజన్‌లో భారీవర్షాలు కురుస్తాయి. వర్షం నీరు ఎప్పటికప్పుడు సముద్రంలోకి పోయేలా ఇప్పటికే గెడ్డల్లో పూడిక తీయించాల్సిన బాధ్యత జీవీఎంసీ అధికారులపై ఉంది. ఏటా ఏప్రిల్, మే నెలల్లోనే పూడికతీత పనులకు టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయిస్తుంటారు. ఈ ఏడాది జీవీఎంసీ అధికారులకు ఆ పనులు చేపట్టాలనే ఆలోచన ఉన్నట్టు కనిపించడం లేదు. వచ్చే నెల నాలుగో తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అప్పటివరకూ టెండర్లు పిలిచేందుకు అవకాశం లేదు. పోనీ తర్వాత అయినా టెండర్లు పిలవాలనుకున్నా కౌన్సిల్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. కౌన్సిల్ సమావేశం జరిగేంత వరకూ టెండర్లు పిలిచేందుకు ఆస్కారం లేదు. ఇప్పటికే గెడ్డలన్నీ వ్యర్థాలు, పూడికతో నిండిపోయి ఉన్నాయి. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేసే లోపల పొరపాటున భారీవర్షాలు కురిస్తే మాత్రం గెడ్డలన్నీ ఎక్కడికక్కడ పొంగిపోయి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడం ఖాయమని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు ముందుచూపుతో వ్యవహరించి, ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే టెండర్లు పిలిచేసినట్టయితే ఇప్పటికే గెడ్డల్లో పూడికతీత పనులు పూర్తయి ఉండేవని అభిప్రాయపడుతున్నారు.

జగనన్న కాలనీలో రోడ్లు తవ్వేశారు

... 5వ పేజీ తరువాయి

కాలనీలోని రోడ్లను తవ్వేసి ఆ గ్రావెల్‌తోనే బేస్‌మెంట్లు ఫిల్లింగ్ చేసేశారు. నెల రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతే కాకుండా బేస్‌మెంట్‌లో మట్టిని కూరకుండానే ఇళ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయని, కట్టిన నిర్మాణాలకు కనీసం వాటరింగ్ కూడా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. బేస్‌మెంట్ల ఫిల్లింగ్‌కు రోడ్లను తవ్వేయడం విచిత్రంగా ఉందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి లేఅవుట్ రోడ్లను తవ్వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'జన్మభూమి' 3 గంటలు ఆలస్యం

... 5వ పేజీ తరువాయి

ఈ రైలు కిక్కిరిసిపోయింది. కూర్చొనేందుకు సీట్లు లేకపోవడంతో ప్రయాణికులు ప్రవేశ ద్వారాల వద్ద కూర్చొని వెళ్లారు. రైల్వే అధికారులు స్టేషన్‌లో రద్దీ, కిక్కిరిసిన రైళ్లను చూసైనా సరే అదనపు రైళ్లను నడపడం లేదని, వేసవి సెలవుల దృష్ట్యా కొద్దిరోజులు రైళ్ల రద్దును నిలిపివేయాలని రైలు వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

క్లాప్ కార్మికులకు అందని వేతనాలు

... 5వ పేజీ తరువాయి

కొంతమంది మధ్యవర్తులకు రూ.50 వేలు వరకూ చెల్లించినట్టు తెలిసింది. జీవీఎంసీలో ఉద్యోగాలు అనేసరికి ఎప్పుడైనా పర్మనెంట్ అయిపోతాయని మధ్యవర్తులు, కాంట్రాక్టర్ చెప్పడంతో అప్పులు చేసి మరీ డబ్బులు కట్టినట్టు కార్మికులు చెబుతున్నారు. ఇప్పుడు మానేస్తే, గతంలో కట్టిన డబ్బుతోపాటు మూడు నెలల వేతనాన్ని కూడా కోల్పోవాల్సి వస్తుందనే ఉద్దేశంతో అర్ధాకలితోనే విధులు నిర్వర్తిస్తున్నామని వాపోతున్నారు. ఈ విషయం జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావిస్తే కాంట్రాక్టర్ ఇంతవరకూ బిల్లు పెట్టలేదని చెబుతున్నారు. అయినా కాంట్రాక్టర్ ముందుగా కార్మికులకు వేతనాలు చెల్లించి, తర్వాత ఆ బిల్లు తమకు పెడితే నిధులు విడుదల చేస్తామన్నారు. అందుకోసం కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ కొంత మార్జిన్ కూడా ఇస్తోందని వివరించారు. అయితే కాంట్రాక్టర్ మాత్రం జీవీఎంసీ బిల్లు ఇచ్చిన తర్వాతే కార్మికులకు చెల్లించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

'ఆదారి' గెలవాలంటూ పూజలు



పెద్దింటమ్మకు పూజలు చేస్తున్న వైసీపీ నాయకులు

మల్కాపురం, మే 22: వైసీపీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థిగా పోటీ చేసిన ఆదారి ఆనంద్‌కుమార్ అత్యధిక మెజారిటీతో గెలవాలని కోరుతూ 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ ఆధ్వర్యంలో ఇక్కడి పెద్దింటమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సీఎంగా మళ్లీ జగన్ బాధ్యతలు చేపట్టాలని వేడుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ ఉత్తరాంధ్ర అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, క్లస్టర్ మండలాధ్యక్షుడు భోగవిల్లి నాగభూషణం, దాడి సత్యనారాయణ (డిపో), జి.వెంకటసత్యనారాయణరాజు (వాసు), ఎం.అప్పారావు, కైలాస్, తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఆస్పత్రిలో కుక్కల భయం

ఉక్కుటౌన్‌షిప్, మే 22: ఉక్కు జనరల్ ఆస్పత్రికి వచ్చే వారిని కుక్కల భయం వెంటాడుతోంది. ఆస్పత్రిలో ఎక్కడ పడితే అక్కడ కుక్కలు తిష్ఠ వేయడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రి ప్రాంగణంలో కుక్కలు నిద్రిస్తున్నా వాటి నియంత్రణకు ఎవరూ చర్యలు చేపట్టడం లేదని పలువురు వాపోతున్నారు. దీంతో ఆస్పత్రి ఆవరణలో తిరగాలంటేనే భయంగా ఉందని ఉద్యోగులు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడాకారులకు పౌష్టికాహారం

ఉక్కుటౌన్‌షిప్, మే 22: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా భారత్ బాక్సింగ్ క్లబ్ కోచ్ చట్టి వెంకటేశ్ ఆధ్వర్యంలో ఇక్కడి క్రీడా మైదానంలో చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందుతున్న చిన్నారులకు తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పెంటి రాజు పౌష్టికాహారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తాము అండగా ఉంటామన్నారు.

ప్లే స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి



ఆర్జేడీకి వినతి పత్రం ఇస్తున్న అప్సా ప్రతినిధులు

గాజువాక, మే 22: నిబంధనలు అతిక్రమిస్తున్న ప్లేస్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని ఆర్జేడీ బి.విజయ్‌భాస్కర్‌కు ప్రైవేట్ పాఠశాలల సంఘం (అప్సా) ప్రతినిధులు వినతి పత్రం అందజేశారు. ప్లే స్కూల్స్ ముసుగులో 1,2,3తరగతులను అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సింహాచలం, ప్రతినిధులు పి.భాస్కరరావు, జనార్దన్, గణపతిరావు, సత్యం, రామ్మోహన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

గోపాలపట్నం, మే 22: ఫీడర్ నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని జోన్ 3 ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. గోపాలపట్నం బంక్ ఏరియా, ఇందిరానగర్, నరసింహనగర్, గణేశ్‌నగర్, గోపాలపట్నం మెయిన్ రోడ్డు ఏరియా, లక్ష్మీనగర్, రామకృష్ణా నగర్, కొత్తపాలెం, సంతోష్‌నగర్, నాగేంద్రకాలనీ, సూర్యనగర్, డీపీ ఆర్‌నగర్, గణపతినగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ సరఫరా ఉండదన్నారు.

బాలసదనంలో ప్రవేశాలకు ఆహ్వానం

భీమునిపట్నం: భీమిలి ప్రభుత్వ బాల సదనంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల సూపరింటెండెంట్ కె.ప్రమీల తెలిపారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, తల్లి, తండ్రి గాని లేని వారు అర్హులన్నారు. అర్హత గల వారు జూన్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలని, 7893514460, 7989142781 నంబర్లలో సంప్రతించాలన్నారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 26, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 28, బెండకాయలు 32, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 40, బీట్‌రూట్ 26, బీరకాయలు 40, ఆనపకాయ 18, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 28, క్యారెట్ 30, దొండకాయలు 30, బంగాళదుంపలు 28, అరటికాయ (పెద్దది) 7, చిన్నది 5, మునక్కాడలు (కిలో) 65, అల్లం (పాతది) 110, బరబాటి 54, ముల్లంగి 20, నిమ్మకాయలు (కిలో) 110, గోరుచిక్కుడు 34, దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 22, బీన్స్(పెన్సిల్) 46, ఆగాకర 90, పొటల్స్ 62, కీరదోస 32, క్యాప్సికమ్ 54, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 48, చిలగడదుంపలు 28, కంద 64, దేముడుచిక్కుడు 54, కొండఉసిరి 65, కరివేపాకు (కిలో) 50, కొత్తిమీర (కిలో) 120, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, కొత్తిమీర (చిన్న కట్ట) 10, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 70, బూడిద గుమ్మడికాయ 26, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 34, జామకాయలు (కిలో) 55. మామిడి పండ్లు హిమపసంద్ కిలో 150

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	133
ఫారం ధర	--	153
విత్ స్కిన్	--	276
స్కిన్‌లెస్	--	286



రైల్వే స్టేషన్‌లో రద్దీగా ఉన్నప్లాట్‌ఫారమ్



ఇళ్లకు చేరేందుకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

కిటకిటలాడిన దువ్వాడ రైల్వే స్టేషన్

కూర్మన్నపాలెం, మే 22: రైలు ప్రయాణికులతో దువ్వాడ రైల్వే స్టేషన్ బుధవారం కిటకిటలాడింది. వేసవి సెలవుల నేపథ్యంలో వివిధ ప్రాంతాలకు వెళ్లే వారితో పాటు ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన వారితో రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాల్లో సందడి నెలకొంది. ఈ స్టేషన్లో 45 జతల రైళ్లతో పాటు కొన్ని ప్రత్యేక రైళ్లను నిలుపుతారు. ఒకరోజుకు సుమారు రూ.నాలుగు లక్షలు, ఏడాదికి దాదాపు రూ.12 కోట్ల ఆదాయం వస్తుంది. సంవత్సరానికి సుమారు 12 లక్షల మంది ప్రయాణికులు ఇక్కడ నుంచి రాకపోకలు సాగిస్తుంటారని అంచనా. స్టీల్‌ప్లాంట్, ఎన్టీపీసీ, బెల్,

సందడిగా కనిపించిన పరిసర ప్రాంతాలు

టౌన్‌షిప్, వీఎస్‌ఈజెడ్ ఉద్యోగులు, కూర్మన్నపాలెం, అగనంపూడి, లంకెలపాలెం, సబ్బవరం, గాజువాక, ఆటోనగర్, గ్రీన్ సిటీ, ఎస్టీబీఎల్, షీలానగర్, తదితర ప్రాంతాల ప్రజలు ఈ రైల్వే స్టేషన్‌నే ఎక్కువగా వినియోగిస్తుంటారు. పదేళ్ల క్రితం ఆదర్శ స్టేషన్‌గా ప్రకటించి కొన్ని అభివృద్ధి పనులు చేశారు. ఆదాయం అధికంగా ఉండడంతో 2023 ఫిబ్రవరిలో దీనిని అమృత్ భారత్ స్టేషన్‌గా ప్రకటించారు. దీంతో నాలుగో ప్లాట్‌ఫారమ్ అభివృద్ధి పనులు, పార్కింగ్ అభివృద్ధి, ఆర్పీఎఫ్ కార్యాలయ నిర్మాణం, ఎఫ్‌వోబీ, తదితర పనులను ప్రారంభించారు. పూర్తి స్థాయిలో ఆ పనులను త్వరితగతిన పూర్తి చేయాల్సిందిగా దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరుతున్నారు. కాగా రైల్వే ప్రయాణికుల నుంచి ఆటోవాలాలు అధిక చార్జీలను వసూలు చేస్తున్నందున ప్రీపెయిడ్ ఆటోలను ఏర్పాటు చేయాలనీ పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు. రైల్వే స్టేషన్‌ను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తే ఆదాయార్జనలో మంచి ఫలితాలు ఉంటాయని అసోసియేషన్ ప్రతినిధి కె.ఈశ్వర్ పేర్కొన్నారు.

గ్రంథాలయాల్లో చిన్నారులకు చిత్రలేఖన పోటీలు

పెదగంట్యాడ, మే 22: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, స్వచ్ఛ విశాఖ అంశాలపై నిర్వహించిన ఈ పోటీల్లో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఉత్తమ చిత్రాలు వేసిన ఐదుగురిని ఎంపిక చేశారు. విజేతలకు శిబిరం ముగింపు రోజుల బహుమతులను అందజేస్తామని గ్రంథాలయాధికారి రమణ తెలిపారు.



గాజువాకలో మెలకువలు నేర్పుతున్న దృశ్యం

పెందుర్తి: పెందుర్తి గ్రంథాలయంలో బుధవారం పత్రికా పఠనం నిర్వహించారు. దీనివల్ల మేథస్సు వికసిస్తుందని వక్తలు తెలిపారు. అనంతరం యువత తమ అనుభవాలను వివరించారు. అంతకుముందు కథలు చదవడం, రాయడంపై వివరించారు. చిత్రలేఖనంలో తర్ఫీదు ఇచ్చారు. గ్రంథాలయాధికారి సూర్యకళ, ఆదారి రామకృష్ణ పాల్గొన్నారు.

గాజువాక: గాజువాక గ్రంథాలయంలో బుధవారం కథలు చెప్పడం, రాయడం, చదవడం, చదివించడం వంటి అంశాలపై రిసోర్స్ పర్సన్ ఎం.అనూష విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. డ్రాయింగ్‌లో మెలకువలు నేర్పించారు. లైబ్రేరియన్ చంద్రకళ పాల్గొన్నారు.



పెందుర్తిలో చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్

సీఎండీతో ఉక్కు కార్మిక సంఘాలు భేటీ

ఉక్కుటౌన్‌షిప్, మే 22: స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌తో ఉక్కు కార్మిక సంఘాల నాయకులు బుధవారం పరిపాలన భవనంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని యాజమాన్యం వేధింపులకు గురి చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జీతాలు ఆలస్యంగా ఇస్తున్నారని, ఈ నెల ఇప్పటివరకు పూర్తి జీతం ఇవ్వలేదన్నారు. కార్మికులకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలను పట్టించుకోవడం లేదని వివరించారు. ఉక్కు ఉత్పత్తి చేసేందుకు కార్మికులు సిద్ధగా ఉన్నప్పటికీ యాజమాన్యం తగిన వనరులను సమకూర్చడం లేదన్నారు. కార్మిక సమస్యలు పరిష్కరించాలని, బార్స్ విషయంలో తలెత్తుతున్న పలు సమస్యలను సీఎండీకి నివేదించారు. అనంతరం అతుల్‌భట్ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమానికి యాజమాన్యం కృషి చేస్తుందని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కొన్ని ఇబ్బందులు ఉన్నాయని, త్వరలోనే సవాళ్లను అధిగమించి ముందుకు సాగుతామన్నారు. కార్యక్రమంలో ఉక్కు డైరెక్టర్లు, ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరాం, మంత్రి రాజశేఖర్, వరసాల శ్రీనివాసరావు, డి.అప్పారావు, కొమ్మినేని శ్రీనివాస్, డేవిడ్, డీవీ రమణారెడ్డి, మహాలక్ష్మినాయుడు, సీహెచ్ సన్యాసిరావు, జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు ఉద్యోగులకు తక్షణమే జీతాలు చెల్లించాలి'



రిలే నిరాహార దీక్షలో పాల్గొన్న ఎస్.రామారావు

కూర్మన్నపాలెం, మే 22: స్టీల్‌ప్లాంటుకు వచ్చే ఆదాయంలో తొలి ప్రాధాన్యంగా ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు ఎస్.రామారావు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,196వ రోజుకు చేరాయి. కార్పొరేట్ల అభివృద్ధే ధ్యేయంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. నాయకుడు డీసీహెచ్ వెంకటేశ్వరరావుమాట్లాడుతూ రూ.లక్షల కోట్లను ప్రజల వద్ద నుంచి పన్నుల రూపంలో వసూలు చేస్తూ దాని ని దేశాభివృద్ధికి వినియోగించకుండా కార్పొరేట్ శక్తులకు రాయితీల రూపంలో అందజేస్తున్న ప్రభుత్వాలకు తగిన సమయంలో బుద్ధి చెబుతామన్నారు. మరో కార్మిక సంఘ నాయకుడు వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రభుత్వ రంగాలను విక్రయించాలనుకోవడం దారుణమన్నారు.

'కూటమిదే విజయం'



వడ్లపూడి టీడీపీ కార్యాలయంలో కూటమి నేతల సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ వార్డు అధ్యక్షుడు దశేంద్ర

కూర్మన్నపాలెం, మే 22: ఎన్నికల్లో కూటమి విజయం తథ్యమని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ అన్నారు. 87వ వార్డు వడ్లపూడి టీడీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు విజయోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక స్థానాలను కూటమి అభ్యర్థులే కైవశం చేసుకుంటారని, గాజువాక ఎమ్మెల్యేగా పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీగా శ్రీభరత్ అత్యధిక మెజారిటీతో గెలుపొందుతారన్నారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. బీజేపీ కో-కన్వీనర్ లక్కరాజు సోంబాబు, జనసేన వార్డు ఇన్‌చార్జి సిరసపల్లి కనకరాజులు మాట్లాడుతూ కార్యకర్తలు, బూత్ ఏజెంట్లు కూటమి అభ్యర్థుల విజయం కోసం ఎంతో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎస్ విజయరామరాజు, రాజన్‌రాజు, సత్తిబాబు, వర్రె రాంబాబు, భాగ్యలక్ష్మి, శ్రీను, దానయ్య, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

అగనంపూడి: రాష్ట్రంలో కూటమి విజయం ఖాయమని తెలుగుదేశం పార్టీ 85వ వార్డు అధ్యక్షుడు కర్రి దశేంద్ర అన్నారు. బుధవారం శ్రేణులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ గాజువాక నియోజకవర్గ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుతో పాటు ఎంపీ అభ్యర్థి శ్రీభరత్‌కు అత్యధిక మెజారిటీ రావడం ఖాయమన్నారు. కూటమి గెలుపు కోసం శ్రేణులంతా ఎంతో కష్టించి పనిచేశారని, జూన్ తొమ్మిదిన ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు అందరూ సమన్వయంతో ఉండాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు దాసరి త్రినాథ్, గవర సోమశేఖర్, కరణం సత్యారావు, ఎం.విజయ్, కె.అప్పలరాజు, జి.అప్పారావు, బి.సత్యనారాయణ, ఎం.వెంకటరమణ, కనకభవానీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతిలో ప్రతి జీవికీ ముఖ్య పాత్ర



జీవ వైవిధ్యంపై మాట్లాడుతున్న అనసూయాదేవి

మల్కాపురం, మే 22: ప్రకృతిలో ప్రతి జీవి ప్రముఖమైనదేనని, దానిని రక్షించడం మన బాధ్యతని జాతీయ సేవా పథకం సీనియర్ ప్రోగ్రాం అధికారి వై.అనసూయదేవీ అన్నారు. మల్కాపురం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో బుధవారం జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా ఆమె మాట్లాడుతూ సృష్టిలో ఉత్పత్తిదారులు, వినియోగదారులు, విచ్ఛిన్నకారులని మూడు రకాల జీవులున్నాయని ఇవి ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయన్నారు. జీవనవైవిధ్యం దెబ్బ తినడం వల్ల వాతావరణంలో మార్పులు సంభవిస్తున్నాయన్నారు. అనంతరం చిన్నారులు వివిధ కళాకృతులను తయారుచేశారు. రచయిత సత్తిరాజు బారిష్టర్ పార్వతీశం నవలను చిన్నారులకు పరిచయం చేశారు. రాజారామోహన్‌రాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈపీఎస్ భాగ్యలక్ష్మి, అజేయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా స్వాతి నక్షత్ర హవనం





హవనంలో పాల్గొన్న రఘురామ కృష్ణరాజు, గంటా, విష్ణుకుమార్ రాజు, (ఇన్‌సెట్లో) పూర్ణాహుతి

సింహాచలం, మే 22: వరాహలక్ష్మీనృసింహస్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని సింహగిరిపై స్వాతి నక్షత్ర హవనం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయదేవేరులతో బంగారు తొళ్లక్కియాన్‌లో, మరో పల్లకిలో సుదర్శన పెరుమాళ్‌ను మంగళవాయిద్యాల నడుమ యాగశాలకు తీసుకువచ్చారు. స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐ.వెంకటరమణాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు సారధ్యంలో 205 మంది భక్తుల గోత్రనామాలతో సంకల్పించి ఆగమోక్తంగా బింబారాధన, కలశారాధన, మూర్తి ఆరాధన, మండపారాధన జరిపారు. తరువాత వృద్ధాగ్నిని ఆలయ పోటు నుంచి తీసుకువచ్చి హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. సుదర్శన మూల మంత్రంతో హవనం జరిపించారు. పూర్ణాహుతి ద్రవ్యాలను భక్తులతో స్పృశింపజేశారు. మంగళవాయిద్యాల నడుమ భక్తుల మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం ప్రధాన కలశాన్ని ఆలయ బేడామండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలో మూలవిరాట్ వద్ద ఉంచి పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ జరిపారు. భక్తులకు అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలను అందజేసి అంతరాలయంలో స్వామివారి దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు దంపతులు,సుధాగజపతిరాజు, మాజీ మంత్రులు గంటా, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే నాయుడు (గణబాబు), ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై కాంక్రీట్‌తో ప్రమాదాలు



ప్రమాదాలకు నిలయంగా మారిన కాంక్రీట్ దిమ్మ

ఎన్ఏడీ జంక్షన్, మే 22: బుచ్చిరాజుపాలెం నుంచి ఎన్ఏడీ ఫ్లైఓవర్‌కు కిందకు వెళ్లే సర్వీసు రోడ్డులో రహదారులపై పేరుకుపోయిన కాంక్రీట్ కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ సర్వీసు రోడ్డులో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. ఎన్.ఎస్.టి.ఎల్ వైపుకు వెళ్లేందుకు ఎక్కువమంది రాంగ్ రూట్‌లో ఈ మార్గంలో ప్రయాణం చేస్తుంటారు. ఈ సమయంలో ఎన్ఏడీ కరాస మీదుగా వెళ్లే వాహనాలు కుడివైపు మళ్లే ప్రాంతంలో రోడ్డుకు షిల్లర్ కాంక్రీట్‌కు సమానంగా లేక, ఎత్తుగా ఉండడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. రద్దీ సమయంలో ద్విచక్రవాహనాలు కూడా ఆదిబ్బపైకి ఎక్కి ప్రమదాల బారిన పడుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారికి సమానంగా ఉండేలా కాంక్రీట్ దిబ్బను తొలగించడం లేదా. మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కథలకు ఉత్తరాంధ్ర పుట్టినిల్లు



మాట్లాడుతున్న శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట, మే 22: సీతంపేట రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ సంస్థ ఆధ్వర్యంలో కథాకచేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి అధ్యక్షత వహించిన సంస్థ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ తెలుగు సాహిత్యం పై మాట్లాడారు. కథలు మానవ సంబంధాల సంక్లిష్టను తెలియజేస్తామన్నారు. మాన విలువలు, సామాజిక సమస్యలను పరిష్కారానికి, విశ్లేషించడానికి దోహదం చేస్తాయన్నారు. తొలుతనుంచి ఉత్తమ విలువలతో కూడిన కథలు ఉత్తరాంధ్ర నుంచి వచ్చాయన్నారు. వీటిని చదివి వర్తమాన రచయితలు స్ఫూర్తి పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్తలు డాక్టర్ వేణు, డాక్టర్ జీవీ సూర్యారావు, డాక్టర్ సూరపనేని విజయకుమార్, చిన సూర్యానారాయణ, తదితరులు పాల్గొన్నారు.

జీవ వైవిధ్య పరిరక్షణకు సమాజ భాగస్వామ్యం అవసరం

- తూర్పు కనుముల్లో జీవ వైవిధ్యంపై పరిశోధనలు సాగాలి
- పురాతన సంప్రదాయ జీవన విధానాలు భావితరాలకు అందివ్వాలి
- రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి



ప్రసంగిస్తున్న చిరంజీవి చౌదరి. వేదికపై ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, జాతీయ జీవ వైవిధ్య మండలి ప్రతినిధి ఆచార్య రాయప్ప, తదితరులు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): మానవ మనుగడతో ముడిపడి ఉన్న జీవ వైవిధ్యం పరిరక్షణలో సమాజ భాగస్వామ్యం అవసరమని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి అన్నారు. ఆ దిశగా అడుగులు పడితేనే 2030 నాటికి అన్ని రంగాలకు సుస్థిరమైన పర్యావరణ ఫలాలు అందుతాయన్నారు. ఆ దిశగా రాష్ట్ర జీవ వైవిధ్య మండలి ప్రణాళికలు రూపొందించి అమలు కోసం పనిచేస్తోందన్నారు. అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని ఏయూ కన్వెన్షన్ హాలులో బుధవారం జాతీయ స్థాయి జీవ వైవిధ్య దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిరంజీవి చౌదరి మాట్లాడుతూ సుస్థిర పద్ధతిలో ఫలాలు అందాలంటే ఒకటి...జీవ వైవిధ్య పరిరక్షణ, రెండోది...ప్రకృతిలో లభ్యమయ్యే జీవ వనరుల స్థిరమైన వినియోగం, మూడోది...జీవ వనరుల ద్వారా వచ్చే ఫలాలు వాటాదారులకు సమంగా అందాలన్నారు. తీవ్రమైన విపత్తులు, కరువు, మడ అడవుల నరికివేత, వనరుల విధ్వంసం వంటి కారణాలతో వాతావరణ మార్పులు సంభవిస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తంచేశారు. వాతావరణ మార్పులతో జీవ వైవిధ్యానికి కలిగే దుష్పరిణామాలను నివారించేందుకు క్షేత్రస్థాయిలో జీవ వైవిధ్య మండళ్లు కృషిచేయాలన్నారు. గ్రామాలు, అడవుల్లో నివసిస్తున్నవారు ఆచరించే పురాతన సంప్రదాయ విధానాలను ఆధునికత జోడించి భావితరాలకు అందించాలన్నారు. జీవవైవిధ్యం పరిరక్షణకు విద్యా రంగంలో సంస్కరణలు రావాలని కోరారు. పశ్చిమ కనుములతో పోల్చితే తూర్పు కనుముల్లో జీవవైవిధ్యం విశిష్టత తెలియడానికి విస్తృతమైన పరిశోధనలు జరగాలన్నారు. విశాఖపట్నంలో అటవీ శాఖ అధికారి అనంతశంకర్ జీవ వైవిధ్యంపై ఒక పార్కు ఏర్పాటుచేయడం అభినందనీయమన్నారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ వర్సిటీలో జీవ వైవిధ్య పరిరక్షణకు సంబంధించి అన్నిరకాల కార్యకలాపాలు చేపడుతున్నామన్నారు. దేశంలో గుర్తింపుపొందిన రెండు గ్రీన్ విశ్వవిద్యాలయాల్లో ఏయూ ఒకటన్నారు. వర్సిటీ బోటనీ విభాగానికి సమీపంలో 10 ఎకరాల్లో బయో డైవర్సిటీ పార్కును ఏర్పాటుచేస్తున్నామని తెలిపారు. ఆలివ్‌రిడ్లే తాబేళ్ల సంరక్షణకు విశాఖలో స్వచ్ఛంద సంస్థలు, మీడియా ఇచ్చిన ప్రాధాన్యం గుర్తుచేసుకుంటూ సముద్రానికి అభిముఖంగా కన్వెన్షన్ హాలును తాబేలు ఆకారంలో నిర్మించామన్నారు. జాతీయ జీవ వైవిధ్య మండలి ప్రతినిధి ఆచార్య రాయప్ప రామప్ప మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరికీ ఆహారం అందించాలంటే పురాతన వంగడాలు కొనసాగేందుకు జీవ వైవిధ్యం పాత్ర కీలకమన్నారు. రైతులు, గిరిజనులకు వ్యవసాయం ద్వారా మెరుగైన ఆదాయం వచ్చేలా జీవ వైవిధ్య మండళ్లు ప్రణాళికలు రూపొందించాలని కోరారు. వైఎస్సార్ ఉద్యానవన వర్సిటీ ఉపకులపతి ఆచార్య జానకిరామ్ మాట్లాడుతూ పట్టణీకరణ, అడవుల నరికివేత, కాలుష్యం పెరగడం వంటి కారణాలతో జీవ వైవిధ్యానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. రైతులు ఆహార పంటలతోపాటు కూరగాయలు, ఉద్యానవన పంటలు సంప్రదాయ బద్ధంగా పండించేలా జీవవైవిధ్య మండళ్లు కృషిచేయాలన్నారు. రాష్ట్ర జీవవైవిధ్య మండలి సభ్య కార్యదర్శి బీవీఏ కృష్ణమూర్తి జీవవైవిధ్య పరిరక్షణకు మండలి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అటవీ శాఖ విశాఖ సీసీఎఫ్ ఎస్.శ్రీకంఠనాథరెడ్డి మాట్లాడుతూ తూర్పు కనుముల్లో ఎంతో విశిష్టమైన జీవవైవిధ్యం ఉందని పేర్కొంటూ వాటిని పరిరక్షించాలన్నారు. విశాఖ నుంచి భీమిలి తీరంలో మానవ కార్యకలాపాల వల్ల సముద్ర తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు ఇబ్బంది కలుగుతుందని, తమ శాఖ కొన్నిచోట్ల నెస్ట్‌లు ఏర్పాటుచేసిందన్నారు. కార్యక్రమంలో వివిధ రకాల పుస్తకాలు, బ్రోచర్లు ఆవిష్కరించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డీఎఫ్‌వో అనంతశంకర్, జూ క్యూరేటర్ నందిని సలారియా, రాజమండ్రి జైలు సూపరింటెండెంట్ రాహుల్, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అటవీ శాఖ అధికారులు, ఏడు రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

27 నుంచి పాలిసెట్ దరఖాస్తుల పరిశీలన

కంచరపాలెం, మే 22 : పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (పాలిసెట్-2024)లో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులకు ఈనెల 27వ తేదీ నుంచి దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ప్రారంభించడానికి సాంకేతిక శాఖ ఏర్పాట్లు చేస్తోంది. పాలిసెట్ కౌన్సెలింగ్‌నకు సంబంధించిన నోటిఫికేషన్‌ను సాంకేతిక శాఖ కమిషనర్ బుధవారం విడుదల చేశారు. దీని ప్రకారం ర్యాంకర్లు మే 24 నుంచి జూన్ 2వ తేదీ వరకు ఆన్‌లైన్ పేమెంట్ చేసుకోవచ్చు. ధ్రువపత్రాల పరిశీలనమే 27వ తేదీ నుంచి జూన్ 3వ తేదీ వరకు కంచరపాలెంలో ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని హెల్ప్‌లైన్ కేంద్రాల వద్ద నిర్వహిస్తారు. ఈనెల 31వ తేదీ నుంచి జూన్ 5వ తేదీ సాయంకాలం 5 గంటల వరకు వెబ్‌ఆప్షన్లు ఇవ్వొచ్చు. జూన్ 5న ఆప్షన్లలలో మార్పులు చేసుకునే వీలుంటుంది.జూన్ 7న సీట్ల కేటాయింపు జరగనున్నది. వచ్చేనెల 10వ తేదీ నుంచి పాలిటెక్నిక్ మొదటి ఏడాది తరగతులు ప్రారంభమవుతాయి.

నేడు అప్పన్నకు రెండో విడత చందన సమర్పణ

సింహాచలం, మే 22: వరాహలక్ష్మీనృసింహస్వామికి గురువారం రెండో విడత చందనం సమర్పించనున్నారు. ఈనెల 18 నుంచి నాలుగు రోజుల పాటు అరగదీసిన చందనపు ముద్దలో బుధవారం 32 రకాల సుగంధ ద్రవ్యాల చూర్ణాలను మిళితం చేసి పద్మనిధిలో భద్రపరిచారు. దానిని గురువారం వేకువజామున సుప్రభాత సేవ తరువాత అర్చకులు స్వామివారికి పైపూతగా సమర్పించనున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని అంచనా వేసిన అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గత శనివారం భక్తుల రద్దీతో ఘాట్‌రోడ్డులో తలెత్తిన ట్రాఫిక్ సమస్యకు పరిష్కారంగా భక్తులు తమ వాహనాలను కొండదిగువనే విడిచిపెట్ట దేవస్థానం, ఆర్టీసీ బస్సుల్లో సింహగిరికి రావాలని ఈవో కోరారు.

అధికార పార్టీ దౌర్జన్యాలను అరికట్టాలి

- టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు



ఎన్టీఆర్ విగ్రహం ఎదుట న్యాయవాదులు

మహారాణిపేట, మే 22: అధికార వైసీపీ చేస్తున్న దౌర్జన్యాలు, కుట్రలను అధిగమించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు పోసాని వెంకటేశ్వర్లు కోరారు. బుధవారం నగర పార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈసందర్భంగా ఆయన టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన లీగల్ సెల్ నాయకులతో సమావేశం నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల జరిగిన అనంతరం జూన్ 4వతేదీన జరగనున్న కౌంటింగ్ సమయంలో న్యాయవాదులు అందించాల్సిన సహాయసహకారాలపై చర్చించారు. ఎన్నికల్లో లీగల్ సెల్ న్యాయవాదుల కూటమి అభ్యర్థుల విషయంలో క్రియాశీలక పాత్రవహిస్తు విశేషసేవలు అందించారని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు బి రా జశేఖర్, పీఎస్ నాయుడు, వెన్నెల ఈశ్వ రరావు, పతివాడ గిరిధర్, ఉమా శంకర్, శ్రీధర్, మణికంఠ, సాయి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే జీవకోటి మనుగడ

- కృష్ణా విశ్వ విద్యాలయం పూర్వ ఉప కులపతి రామకృష్ణారావు

సీతంపేట, మే 2: జీవ వైవిధ్య ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కృష్ణా విశ్వ విద్యాలయం విశ్రాంత ఉప కులపతి సుంకరి రామకృష్ణారావు అన్నారు. ద్వారకానగర్‌లో గల పౌరగ్రంథాలయంలో అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ గ్లోబల్ బయోడైవర్సిటీ ఫ్రేమ్‌వర్క్ అమలుకు మద్దతు ఇవ్వడం ద్వారా జీవ వైవిధ్య నష్టాన్ని నివారణకు వీలవుతుందన్నారు. జీవవైవిధ్యంతోనే జీవకోటి మ నుగుడ సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ పది మొక్కలు నాటి పెంచే కార్యక్రమాన్ని ప్రారంభించాలన్నారు. ప్రభుత్వాలు స్థానిక ప్రజలు, స్థానిక కమ్యూనిటీలు, ప్రభుత్వేతర సంస్థలు, చట్టసభ సభ్యులు, వ్యాపారులు, వ్యక్తులు జీవ వైవిధ్య ప్రణాళిక అమలకు మద్దతు నిచ్చే మార్గాలను మెరుగు పరచడానికి ప్రోత్సహించాలన్నారు. ఏవీఎన్ డిగ్రీ కాలేజ్ జువాలజీ లెక్చరర్ అర్చన మాట్లాడుతూ, సముద్రం మన భవిష్యత్తు ఆహార కేంద్రం అన్నారు. అలాంటి సముద్ర జీవరాశిని కాపాడటం మనందరి బాధ్యత అన్నారు. నడుపూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాచకొండ శ్రీనివాస్, సిఫా ట్రస్ట్ సీఈఓ డాక్టర్ శశిప్రభ, యాక్షన్ ఎయిడ్ సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్‌లు జీవ వైవిధ్య పరిరక్షణపై పలు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మురళీనగర్ గార్డెనింగ్ ప్రతినిధులు ఉదయ్‌కుమార్, మళ్ల సరిత, యువ సేన సంస్థ ప్రతినిధి హరి, పీపుల్స్ పవర్ సంస్థ ప్రతినిధి భాస్కర్, ఉపాధ్యాయురాలు పంతులు లలిత, ఎస్ఎఫ్ఎస్ విద్యా సంస్థ ఉపాధ్యాయులు శివ లక్ష్మి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జీవో వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం, యాక్షన్ ఎయిడ్ ఫెలోషిప్ ప్రతినిధులు కృష్ణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుంకరి రామకృష్ణారావు

నేలబావిలో పడి ఒకరి మృతి



శివాజీకుమార్ మృతదేహం

దత్తిరాజేరు, మే 22: స్నేహితుడి గ్రామంలో పండగకు వెళ్లిన ఓ వ్యక్తి.. ప్రమాదవశాత్తు నేలబావిలో పడి ప్రాణా లు కోల్పోయాడు. ఈ సంఘటన విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం రాజులపేటలో బుధవారం జరిగింది. పెదమానాపురం పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఆర్టీసీలో పనిచేస్తున్న విశాఖలోని నక్కవానిపాలేనికి చెందిన కునుచర్ల శివాజీకు మార్ (60) స్నేహితులతో కలిసి విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం చినకాద పంచాయతీ రాజులపేటకు చెందిన బుద్ధ రమేష్‌రాజు ఆహ్వానం మేరకు గ్రామ దేవత పండగకు మంగళవారం వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం భోజనం చేసి శివాజీకుమార్ బహిర్భూమి కోసం బయటకు వెళ్లాడు. సాయంత్రం వరకూ రాకపోవడంతో రమేష్‌రాజు, స్నేహితులు వెతికారు. గ్రామ సమీపంలోని నేలబావి వద్ద దుస్తులు, షూ కనిపించడంతో బావిలో పరిశీలించగా శివాజీకుమార్ మృతదేహం కనిపించింది. స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు. ప్రమాదవశాత్తూ బావిలో పడిపోయి ఉంటాడని స్థానికులు చెబుతున్నారు. శివాజీకుమార్‌కు భార్య శారదాదేవి, కుమా రుడు భార్గవరాజు ఉన్నారు. మృతదేహానికి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టు మార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్గవరాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్నిమాంబ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ లెక్కింపులో దేవదాయ శాఖ సిబ్బంది, భక్తులు

జ్ఞానాపురం, మే 22: అచ్చియ్యమ్మపేట గ్రామదేవత ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం హుండీ లెక్కంపు బుధవారం దేవదాయశాఖ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాల్‌రెడ్డి పర్యవేక్షణలో శ్రీహరిసేవ సంఘం సహకారంతో జరిగింది. మార్చి 18నుంచి మే 22 వరకు మొత్తం 65రోజులకు గాను హుండీల ద్వారా రూ. 27,01,011 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో డీవీఎస్ సురేష్ బాబా తెలిపారు. ఏపీజీవి బ్యాంక్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చార్కోల్‌తో అప్పన్న చిత్తరువు



చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న అశోక్ దంపతులు

సింహాచలం, మే 22: నగరానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చార్కోల్‌తో సింహాద్రినాథుని చిత్తరువును రూపొందించారు. ఇప్పటివరకు మిలెట్స్‌తో పలు రకాల చిత్రాలను రూపొందించిన ఆయన ఈనెల 10న జరిగిన చందనోత్సవం తరువాత అప్పన్నస్వామి నిజరూపం, నిత్య రూపాల మేలు కలయికతో చిత్రాన్ని తయారు చేయాలని నిర్ణయించుకుని, ఐదు అడుగుల ఎత్తు, నాలుగు అడుగుల వెడల్పు కలిగిన చిత్రాన్ని రూపొందించారు. దానిని దేవాలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు దంపతుల చేతుల మీదుగా బుధవారం సింహగిరిపై ఆవిష్కరించారు. చిత్రపటాన్ని ఎల్లప్పుడు భక్తులకు కనిపించే స్థలంలో దేవాలయం ఆవరణలో ఏర్పాటు చేయాలని విజయ్‌కుమార్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఈఓ శ్రీనివాసమూర్తి, ఈఈ బండారు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థిపై దాడి

- కేసు నమోదులో పోలీసుల తాత్సారం

ఎంవీపీ కాలనీ, మే 22 : పాత గొడవల నేపథ్యంలో ఒక వర్గం వారు ఇండిపెండెంట్ అభ్యర్థిపై దాడి చేశారు. దాడికి గురైన వ్యక్తి ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఎంపీ సీటుకు పోటీ చేశారు. 22 వార్డు కార్పొరేటరు, జనసేన నాయకుడు మూర్తి యాదవ్‌తో విభేదాలు దృష్ట్యా ప్రస్తుతం జరిగిన దాడి ప్రాధాన్యత సంతరించుకుంది. శివాజీపాలెం దరి మంగాపురం కాలనీలో ఉంటున్న దేవర శంకర్, అతడి సోదరుడు జనసేనలో తిరిగేవారు. పలు అంశాల్లో అదే వార్డులో కార్పొరేటరుగా ఉంటున్న మూర్తి యాదవ్‌కు వారికి విభేదాలు ఉన్నాయి. తనపై సోషల్ మీడియాలో పలు పోస్టులు పెట్టినట్టు మూర్తి యాదవ్ కొద్దిరోజుల క్రితం వారిపై సీపీకి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం మూర్తి యాదవ్ అనుచరులు శంకర్ ఇంటికి వెళ్లి, అతిడితో వాగ్వాదానికి దిగారు. అనంతరం దాడి చేయడంతో, శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాత్రి పది గంటల వరకూ సమాచారం ఇవ్వడంలో పోలీసులు గోప్యత పాటించడం పలు అనుమానాలకు తావిచ్చింది. మరోపక్క ఈ గొడవను తమకు అనుకూలంగా మార్చుకునేందుకు వైసీపీ ప్రయత్నించిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేసు నమోదు చేయాలంటూ కొందరు, వద్దని మరికొందరు పోలీసులపై ఒత్తిడి తీసుకురావడంతో నాన్చుడు ధోరణి అవలంబించారు. ఎట్టకేలకు చినవాల్తేరుకు చెందిన బోగ రవిశంకర్, మంగాపురం కాలనీకి చెందిన కొయ్య రామకృష్ణ, గొలగాని స్వామి అనే ముగ్గురిపై సెక్షన్ 324 ప్రకారం కేసు నమోదు చేసినట్టు సీఐ సంజీవరావు తెలిపారు.

సర్వే ఫలితాలన్నీ ఏకపక్షమే..

- రాష్ట్రంలో కూటమిదే విజయం.. మాజీ మంత్రి గంటా



మాట్లాడుతున్న గంటా. పక్కన సోమిరెడ్డి, రఘురామకృష్ణంరాజు తదితరులు

విశాఖపట్నం, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్నికలపై సర్వే సంస్థల ఫలితాలన్నీ ఏకపక్షంగానే ఉన్నాయని, కూటమిదే విజయమని మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఎంవీపీ కాలనీలోని తన స్వగృహంలో బుధవారం కూటమి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రఘురామకృష్ణ రాజులతో కలిసి ఆయన మాట్లాడారు. జూన్ 4న వచ్చే ఫలితాలు చూసి జగన్‌మోహన్‌రెడ్డి షాక్‌కు గురికావడం తథ్యమన్నారు. పోలింగ్ సరళి అంతా ఏకపక్షంగా జరిగినట్టు తెలిసిపోతున్నదన్నారు. హైదరాబాద్, బెంగళూరుల నుంచి ఓటర్ల తాకిడి సంక్రాంతి రాకపోకలను తలపించిందన్నారు. మాచర్ల, పల్నాడు, తాడిపత్రి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న దాడులు వైసీపీ నాయకుల నిరాశ, నిస్పృహలను తెలియజేస్తున్నదన్నారు. ఓడిపోతున్నామని తెలిసినా సరే విశాఖలో జూన్ 9న జగన్ ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు అంటూ ఆ పార్టీ నాయకులు మాట్లాడడంపై జనం నవ్వుకుంటున్నారన్నారు. సమావేశంలో పాల్గొన్న నాయకులంతా విష్ణుకుమార్ రాజుతో సహా అసెంబ్లీలో కాలు పెట్టడం ఖాయమన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద అప్రమత్తం: కలెక్టర్

మహారాణిపేట, మే 22: ఆంధ్రా యూనివర్శిటీ ఇంజ నీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈవీఎమ్‌ల స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కల్పించిన భద్రతా చర్యల ను జిల్లా కలెక్టర్ ఏ మల్లికా ర్జున బుధవారం పరిశీలిం చారు. పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల సంబంధించిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా సిబ్బందిని అప్ర మత్తంగా ఉండాలని సూచించారు ఈ కార్య క్రమంలో జాయింట్ పోలీసు కమిషనర్ పకీరప్ప, జాయింట్ కలెక్టర్ మయూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

థియేటర్లు వెలవెల

... 5వ పేజీ తరువాయి

కనిపించడం లేదు. ఫలితంగా మరింత నష్టపోతున్నామని యాజమాన్యాలు వాపోతున్నాయి. ఇలంటి హిట్ సినిమాలన్నీ ఇప్పటికే పలుమార్లు టీవీ చానళ్లలో వచ్చేసినవేనని, దీంతో థియేటర్ ఎక్స్‌పీరియన్స్ కోసం ప్రేక్షకులు రావడం లేదంటున్నారు.

టికెట్ ధరలతో బెంబేలు

థియేటర్లలో టికెట్ ధరలు సగటు ప్రేక్షకుడికి భారంగా మారిపోయాయి. గతంలో ఒక్కో థియేటర్‌లో కనీసం నాలుగైదు క్లాసులుండేవి. తక్కువ ధరకు టికెట్ లభిస్తుండడంతో సామాన్య ప్రేక్షకుల ఆదరణ లభించేది. కానీ ప్రస్తుతం అధికశాతం థియేటర్లలో రెండు క్లాసులకే పరిమితమవుతోంది. అదీ ధర ఎక్కువగా ఉండడంతో రోజు కూలీలు, ఇతర సామాన్యులు థియేటర్ వైపు రావడం లేదు. గతంలో మాదిరిగా ఎక్కువ క్లాసులు అందుబాటులోకి వస్తే ఏడాది పొడవునా థియేటర్లు కళకళలాడుతాయని అంచనా వేస్తున్నారు.

ఓటీటీ ప్రభావం

థియేటర్‌కు జనం రాకపోవడానికి ఓటీటీ ప్లాట్‌ఫాంలు కూడా మరో కారణంగా భావిస్తున్నారు. ముఖ్యంగా ఆండ్రాయిడ్ టీవీలు అందుబాటులోకి రావడం, పెద్దపెద్ద టీవీలు కూడా సామాన్యులు భరించే ధరలకు విక్రయిస్తుండడం, హోం థియేటర్ల ప్రభావం...థియేటర్‌లకు జనం దూరమవడానికి కారణమని చెబుతున్నారు. పైగా థియేటర్‌కు వెళ్లే టికెట్ ధరలతో పాటు ఇంటర్‌వెల్‌లో ఖర్చు భారంగా మారుతోందని సగటు ప్రేక్షకుడు వాపోతున్నాడు. ఈ ఏడాది వేసవిలో థియేటర్లన్నీ ఖాళీగా మారడానికి నాలుగు అంశాలు కీలకంగా మారాయని యాజమాన్య ప్రతినిధులు అంచనా వేస్తున్నారు. సార్వత్రిక ఎన్నికలు, ఐపీఎల్, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం, తీవ్రమైన ఎండల కారణంగా జనం రావడం లేదంటున్నారు. విద్యార్థులకు వేసవి సెలవులు ఇచ్చినప్పటికీ చాలామంది ఓటీటీలో చూద్దామనే భావనలో ఉన్నారంటున్నారు.

థియేటర్లు కళ తప్పాయి

వేసవిలో ఎప్పుడూ థియేటర్‌లు కళకళలాడేవి. ఈసారి సార్వత్రిక ఎన్నికలు, పెద్ద హీరోల సినిమాలు లేకపోవడం థియేటర్లు కళ తప్పడానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. కనీసం ఐదు నుంచి ఏడు శాతం కూడా ఆక్యుపెన్సీ రావడం లేదు. అయినప్పటికీ కొంతమంది థియేటర్‌లు నడుపుతున్నారు. మరికొంతమంది థియేటర్ మరమ్మతులు చేయిస్తుండగా, ఇంకొంతమంది థియేటర్‌లను అమ్మేశారు. పెద్ద హీరోల సినిమాలు విడుదలయ్యేంత వరకు ప్రేక్షకులు థియేటర్లకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

- రమణ, మేనేజర్, మెలోడి థియేటర్

గెడ్డలను వదిలేశారు

... 5వ పేజీ తరువాయి

నాలుగు రోజులపాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో గెడ్డలు పొంగిపోయాయి. దీనివల్ల వన్‌టౌన్ ప్రాంతం మునిగిపోయింది. అధికారులు ముందుజాగ్రత్తగా పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని ఖాళీ చేయించారు. మరో రెండు, మూడు వారాల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉంది. రుతుపవనాల సీజన్‌లో భారీవర్షాలు కురుస్తాయి. వర్షం నీరు ఎప్పటికప్పుడు సముద్రంలోకి పోయేలా ఇప్పటికే గెడ్డల్లో పూడిక తీయించాల్సిన బాధ్యత జీవీఎంసీ అధికారులపై ఉంది. ఏటా ఏప్రిల్, మే నెలల్లోనే పూడికతీత పనులకు టెండర్లు పిలిచి పనులు పూర్తిచేయిస్తుంటారు. ఈ ఏడాది జీవీఎంసీ అధికారులకు ఆ పనులు చేపట్టాలనే ఆలోచన ఉన్నట్టు కనిపించడం లేదు. వచ్చే నెల నాలుగో తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో అప్పటివరకూ టెండర్లు పిలిచేందుకు అవకాశం లేదు. పోనీ తర్వాత అయినా టెండర్లు పిలవాలనుకున్నా కౌన్సిల్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. కౌన్సిల్ సమావేశం జరిగేంత వరకూ టెండర్లు పిలిచేందుకు ఆస్కారం లేదు. ఇప్పటికే గెడ్డలన్నీ వ్యర్థాలు, పూడికతో నిండిపోయి ఉన్నాయి. టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లు పనులు పూర్తిచేసే లోపల పొరపాటున భారీవర్షాలు కురిస్తే మాత్రం గెడ్డలన్నీ ఎక్కడికక్కడ పొంగిపోయి లోతట్టు ప్రాంతాలను ముంచెత్తడం ఖాయమని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఉన్నతాధికారులు ముందుచూపుతో వ్యవహరించి, ఎన్నికల కోడ్ అమల్లోకి రాకముందే టెండర్లు పిలిచేసినట్టయితే ఇప్పటికే గెడ్డల్లో పూడికతీత పనులు పూర్తయి ఉండేవని అభిప్రాయపడుతున్నారు.

జగనన్న కాలనీలో రోడ్లు తవ్వేశారు

... 5వ పేజీ తరువాయి

కాలనీలోని రోడ్లను తవ్వేసి ఆ గ్రావెల్‌తోనే బేస్‌మెంట్లు ఫిల్లింగ్ చేసేశారు. నెల రోజులుగా ఈ వ్యవహారం జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. అంతే కాకుండా బేస్‌మెంట్‌లో మట్టిని కూరకుండానే ఇళ్ల నిర్మాణాలు జరిగిపోతున్నాయని, కట్టిన నిర్మాణాలకు కనీసం వాటరింగ్ కూడా చేయడం లేదని స్థానికులు చెబుతున్నారు. బేస్‌మెంట్ల ఫిల్లింగ్‌కు రోడ్లను తవ్వేయడం విచిత్రంగా ఉందని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా వీఎంఆర్‌డీఏ అధికారులు స్పందించి లేఅవుట్ రోడ్లను తవ్వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'జన్మభూమి' 3 గంటలు ఆలస్యం

... 5వ పేజీ తరువాయి

ఈ రైలు కిక్కిరిసిపోయింది. కూర్చొనేందుకు సీట్లు లేకపోవడంతో ప్రయాణికులు ప్రవేశ ద్వారాల వద్ద కూర్చొని వెళ్లారు. రైల్వే అధికారులు స్టేషన్‌లో రద్దీ, కిక్కిరిసిన రైళ్లను చూసైనా సరే అదనపు రైళ్లను నడపడం లేదని, వేసవి సెలవుల దృష్ట్యా కొద్దిరోజులు రైళ్ల రద్దును నిలిపివేయాలని రైలు వినియోగదారుల సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

క్లాప్ కార్మికులకు అందని వేతనాలు

... 5వ పేజీ తరువాయి

కొంతమంది మధ్యవర్తులకు రూ.50 వేలు వరకూ చెల్లించినట్టు తెలిసింది. జీవీఎంసీలో ఉద్యోగాలు అనేసరికి ఎప్పుడైనా పర్మనెంట్ అయిపోతాయని మధ్యవర్తులు, కాంట్రాక్టర్ చెప్పడంతో అప్పులు చేసి మరీ డబ్బులు కట్టినట్టు కార్మికులు చెబుతున్నారు. ఇప్పుడు మానేస్తే, గతంలో కట్టిన డబ్బుతోపాటు మూడు నెలల వేతనాన్ని కూడా కోల్పోవాల్సి వస్తుందనే ఉద్దేశంతో అర్ధాకలితోనే విధులు నిర్వర్తిస్తున్నామని వాపోతున్నారు. ఈ విషయం జీవీఎంసీ అధికారుల వద్ద ప్రస్తావిస్తే కాంట్రాక్టర్ ఇంతవరకూ బిల్లు పెట్టలేదని చెబుతున్నారు. అయినా కాంట్రాక్టర్ ముందుగా కార్మికులకు వేతనాలు చెల్లించి, తర్వాత ఆ బిల్లు తమకు పెడితే నిధులు విడుదల చేస్తామన్నారు. అందుకోసం కాంట్రాక్టర్‌కు జీవీఎంసీ కొంత మార్జిన్ కూడా ఇస్తోందని వివరించారు. అయితే కాంట్రాక్టర్ మాత్రం జీవీఎంసీ బిల్లు ఇచ్చిన తర్వాతే కార్మికులకు చెల్లించే యోచనలో ఉన్నట్టు తెలుస్తోంది.

బాల సదనంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, మే 22 : పట్టణంలోని చిన్నబజారులో వున్న ప్రభుత్వ బాల సదనంలో ఒకటి నుంచి అయిదవ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల సూపరింటెండెంట్ కె.ప్రమీలా తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ జిల్లా సంచాలకులు ఆదేశాల మేరకు ఈ ప్రవేశాలు కల్పిస్తున్నామన్నారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, తల్లి గాని, తండ్రి గాని లేని వారు అర్హులని చెప్పారు. అర్హత గల వారు జూన్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 7893514460, 798914 2781 నంబర్లను సంప్రతించాలని ఆమె సూచించారు.

ఇష్టానుసారం విద్యుత్ కోతలు

ఆరిలోవ, మే 22 : ఆరిలోవ ప్రాంతంలో కొద్దిరోజులుగా ఇష్టానుసారం విద్యుత్ కోతలు విధిస్తున్నారు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అసలే ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు విపరీతమైన ఉక్కపోత ఉంది. ఈనేపథ్యంలో అనధికార విద్యుత్ కోతల వల్ల చిన్నారులు, వృద్ధులు ఉక్కకు అల్లాడిపోతున్నారు. అలాగే విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో ఎప్పుడు ఉండదో తెలియకపోవడంతో చిరు వ్యాపారులు వ్యాపారాలు సరిగ్గా జరగక నష్టాలు చవిచూస్తున్నారు.

సీసాల్లో పెట్రోల్ పోస్తే చర్యలు

పద్మనాభం (రూరల్), మే 22 : ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పెట్రోల్ బంకుల్లో ఎవరైనా బాటిళ్లకు పెట్రోల్ పట్టినా.. బంకు సిబ్బంది పెట్రోల్ పోసినా కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. బుధవారం వారు మండలంలోని అన్ని బంకుల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అలాగే బంకుల నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల కమిషన్, పోలీసు శాఖ ఆదేశాల మేరకు ఎవరికీ పెట్రోలు లూజు విక్రయాలు చేపట్టరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం

పద్మనాభం (రూరల్), మే 22 : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రేవిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె. స్వప్న సూచించారు. బుధవారం ఆమె రేవిడి. వెంకటాపురం, రౌతులపాలెం గ్రామాల్లో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అలాగే గతంలో క్షయ వచ్చి తగ్గిపోయిన వారు, 60 ఏళ్ల నిండిన క్షయ నివారణకు అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని చెప్పారు.

అక్రమంగా క్వారీలు తవ్వకాలు జరిపితే చర్యలు : తహసీల్దార్

భీమునిపట్నం, మే 22 : మండలంలోని చేపల తిమ్మాపురం కొండవాలు ప్రాంతంలో అక్రమంగా క్వారీ తవ్వకాలు జరుగుతున్నాయన్న ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు బుధవారం ఆ ప్రాంతాన్ని పరిశీలించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. తవ్వకాలపై తహసీల్దార్ తాడ్డి గోవింద్ ఆధ్వర్యంలో ఆర్ఐ మల్లేశ్వరరావు, వీఆర్ఓ అప్పారావు సర్వే చేస్తున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ అనుమతి లేకుండా మండలంలో ఎక్కడైనా అనధికారికంగా గ్రావెల్, ఇసుక తవ్వకాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అక్రమంగా క్వారీ తవ్వకాలు చేపడితే జేసీబీ, తదితర వస్తు సామగ్రి, వాహనాలను సీజ్ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చేపల తిమ్మాపురంలో అనధికారికంగా షెడ్లు నిర్మించినట్టు తెలిసిందని, సర్వే అనంతరం అక్రమ నిర్మాణాలు తొలగిస్తామన్నారు.

27 నుంచి నోటి కేన్సర్‌పై అవగాహన సదస్సులు

సాగర్‌నగర్, మే 22 : నో టొబాకో డే పురస్కరించుకుని గీతం దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి వారం రోజుల పాటు నోటి కేన్సర్‌పై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు ఆ విభాగం అధిపతి డాక్టర్ మనీష్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పొగాకు సంబంధిత ఉత్పత్తులను వాడేవారు నోటి కేన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. 27 నుంచి వారం రోజుల పాటు గీతం దంత వైద్య కళాశాల, ఆస్పత్రి ఆధ్వర్యంలో రోగులకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పొగాకు వాడుతున్న వారు ముందు జాగ్రత్తగా ఈ స్క్రీనింగ్ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించుకుని తగిన చికిత్సతో జాగ్రత్త పడవచ్చునని చెప్పారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సినిమా గైడ్

- **బాక్ :** జగదాంబ, శ్రీరామ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీ (గాజువాక)
- **ఆ ఒక్కటి అడక్కు :** మెలోడీ, సంగం, కిన్నెర, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), లిఖిత(శ్రీహరిపురం), శ్రీకన్య-2 (గాజువాక), శ్రీకన్య సినీపోలీస్ , దుర్గ, (మధురవాడ).
- **ప్రసన్నవదనం :** శరత్, వెంకటేశ్వర-1, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం),
- **శబరి :** వెంకటేశ్వర.
- **రత్నం :** అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), నటరాజ్ (పెందుర్తి), సీతారామయ్య (పరవాడ), రాములమ్మ (తగరపువలస)
- **గీతాంజలి మళ్ళీ వచ్చింది :** రమాదేవి, మౌర్య (గోపాలపట్నం), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి (తగరపువలస)
- **ది ఫ్యామిలీ స్టార్ :** కామేశ్వరి, శ్రీనరసింహ (గోపాలపట్నం)
- **టిల్లు స్క్వేర్ :** శారద, మోహిని (గాజువాక),
- **గాడ్జిల్లా వర్సెస్ కాంగ్ :** శ్రీవెంకటేశ్వర

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 27, టమాటా 28, వంకాయలు (తెలుపు) 20, వంకాయలు (నలుపు) 20, బెండకాయలు 32, పచ్చిమిర్చి 56, కాకరకాయలు 36, బీరకాయలు 46, ఆనపకాయలు 20, కాలీఫ్లవర్ 32, క్యాబేజ్ 22, క్యారెట్ 28, దొండకాయలు 36, బంగాళా దుంపలు 27, అరటికాయ (పె)6, మునక్కాడలు (కిలో) 34, అల్లం (పాతది) 160, బరబటి 50, ముల్లంగి 42, నిమ్మకాయలు (కిలో) 80, గోరుచిక్కుడు 36, దోస కాయలు 22, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 70, పొటల్స్ 44, కీరదోస 26, కాప్సికమ్ 56, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 35, చిలగడదుంపలు 42, కంద 64, దేముడు చిక్కుడు 52, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 40, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 3, పాలకూర (కట్ట) 3, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 40, బూడిద గుమ్మడికాయ 28, కర్రపెండలం 24, మామిడి అల్లం 70, బొప్పాయి 38, జామకాయలు (కిలో) 40.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	550
విజయనగరం	554
శ్రీకాకుళం	554

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	-- 133
ఫారం ధర	-- 153
విత్ స్కిన్	-- 276
స్కిన్‌లెస్	-- 286



హవనంలో పాల్గొన్న రఘురామ కృష్ణంరాజు, గంటా, విష్ణుకుమార్ రాజు, తదితరులు



పెదశేష వాహనంపై గోవిందరాజస్వామి



పూర్ణాహుతి చేస్తున్న అర్చకులు, పక్కన అశోక్ దంపతులు

వైభవంగా స్వాతి నక్షత్ర హవనం

సింహాచలం, మే 22 : వరాహలక్ష్మీనృసింహ స్వామి ఆవిర్భావ నక్షత్రం స్వాతిని పురస్కరించుకుని సింహగిరిపై స్వాతి నక్షత్ర హవనం బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తి చేశారు. ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని ఉభయదేవేరులతో బంగారు తొళ్లక్కియాన్‌లో, మరో పల్లకిలో సుదర్శన పెరుమాళ్‌ను మంగళవాయిద్యాల నడుమ యాగశాలకు తీసుకువచ్చారు. యాగశాలలో స్థానాచార్యులు రాజగోపాల్ పర్యవేక్షణలో, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐ. వెంకటరమణాచార్యులు, పురోహితులు కరి సీతారామాచార్యులు సారధ్యంలో ముందుగా పాల్గొన్న 205 మంది భక్తుల గోత్రనామాలతో సంకల్పించి షోడశోపచారాల పూజలు, నృసింహ అష్టోత్తర శతనామార్చన జరిపించారు. అనంతరం ఆగమోక్తంగా బింబారాధన, కలశారాధన, మూర్తి ఆరాధన, మండపారాధన జరిపారు. తరువాత వృద్ధాగ్నిని ఆలయ పోటు నుంచి తీసుకువచ్చి హోమ కుండంలో అగ్నిప్రతిష్ఠాపన చేశారు. తొలుత పంచసూక్తాలతో, నారసింహ మూర్తి మూల మంత్రాలతో, సుదర్శన మూల మంత్రంతో హవనం జరిపించారు. సంప్రదాయం ప్రకారం పూర్ణాహుతి ద్రవ్యాలను భక్తులతో స్పృశింపజేశారు. మంగళవాయిద్యాల నడుమ భక్తుల గోవింద నామ స్మరణ నడుమ మహా పూర్ణాహుతి వైభవంగా నిర్వహించారు. అనంతరం ప్రధాన కలశాన్ని ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు శిరస్సున దాల్చి ఆలయ బేడామండప ప్రదక్షిణ చేసి అంతరాలయంలో మూల విరాట్ వద్ద ఉంచి పూజలు చేసిన పవిత్ర జలాలతో భక్తులను ప్రోక్షణ జరిపారు. హవనంలో పాల్గొన్న భక్తులకు ఈఓ శ్రీనివాసమూర్తి ఆదేశాల మేరకు అధికారులు అల్పాహారం, మధ్యాహ్నం అన్నప్రసాదాలను అందజేసి అంతరాలయంలో స్వామివారి దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు దంపతులు,సుధాగజపతిరాజు, మాజీ మంత్రులు గంటా, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, రఘురామకృష్ణంరాజు, ఎమ్మెల్యే నాయుడు (గణబాబు), ట్రాఫిక్ అడిషినల్ డీసీపీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.



పూర్ణకలశంతో ప్రధానార్చకుడు ప్రదక్షిణ

ఘనంగా నృసింహ జయంత్యుత్సవం

సింహాచలం, మే 22 : సింహగిరిపై బుధవారం నృసింహ జయంత్యుత్సవం వైభవంగా నిర్వహించారు. సూర్యాస్తమయ సమయంలో నృసింహ వనంలోని భక్త ప్రహ్లాదునితో కలిసి ఉన్న నృసింహస్వామికి దేవస్థానం పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీకాంతాచార్యులు సారధ్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నృసింహ అవతార విశిష్టతను శ్రీకాంతాచార్యులు వివరించారు. స్వామివారికి పలు రకాల ఫలాలు, పంచదార పానకం నివేదన చేసి భక్తులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి, ఏఈఓలు, తదితరులు పాల్గొన్నారు.

సిరిపురం : పాండురంగాపురంలోని నరసింహస్వామి ఆలయంలో హరేకృష్ణ మూమెంట్ విశాఖపట్నం, పాండురంగాపురం ఆలయ కమిటీ అండ్ పీఆర్‌డబ్ల్యూఏ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం స్వామివారి జయంత్యుత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హరేకృష్ణ మూమెంట్ ప్రెసిడెంట్ నిస్కిం చిన భక్తదాస నరసింహస్వామి అవతారం గురించి భక్తులకు వివరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ యదురాజా దాస, తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఈఓ శ్రీనివాసమూర్తి దంపతులు

మధురవాడలో విచ్చలవిడిగా ఆక్రమణలు

విశాఖపట్నం, మే 22 : మధురవాడ పరిసర ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఆక్రమణలు జరుగుతున్నాయి. ఎన్నికల సమయం కావడంతో అధికారులు ఆ పనుల్లో బిజీగా ఉండడంతో అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు.ఇందుకు ఐదవ వార్డు శివశక్తి నగర్‌కు వెళ్లే దారిలో కొండవాలు ప్రాంతంలో అనధికారికంగా జరుగుతున్న నిర్మాణాలే నిదర్శనం. ఇక్కడ ఎంతో విలువైన ప్రభుత్వ భూములు ఆక్రమణకు గురవుతున్నా సచివాలయ సిబ్బంది కాని రెవెన్యూ అధికారులు కాని పట్టించుకోవడం లేదు.ఈ ఆక్రమణల వెనుక అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కీలక నేతలు ఉన్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. కొందరు పదుల సంఖ్యలో అక్రమంగా రేకుల షెడ్లు నిర్మిస్తుండగా, మరికొందరు కొండను తవ్వి చదును చేస్తూ దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇదంతా ఒక ఎత్తయితే అక్రమ నిర్మాణాలకు విద్యుత్ శాఖాధికారులు ఆగమేఘాల మీద కనెక్షన్లు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోంది. కాగా ఆక్రమణలపై స్థానికులు జేసీకి ఫిర్యాదు చేయడంతో బుధవారం చినగదిలి ఆర్ఐ ప్రవీణ్, సచివాలయం సిబ్బంది, పోలీసులతో కలిసి ఆక్రమణల తొలగింపునకు ప్రయత్నించారు. ఆక్రమణలు తొలగించడానికి వచ్చిన జేసీబీ ముందు మహిళలు కూర్చుని కదలకుండా అడ్డుకున్నారు. తమకు ఇళ్లు లేవని, పేదలమని, ఏన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్నామని చెప్పారు. తాము రేకులషెడ్లు వేసుకుంటే ఎలా కూలుస్తారని ప్రశ్నించారు. తమ ఇళ్లు కూల్చాలనుకుంటే ఇప్ప టివరకు జరిగిన ఆక్రమణలను తొలగించి అప్పుడు తమ నివాసాల జోలికి రావాలని తెలిపారు.మహిళలు ఎక్కువగా ఉండడంతో మహిళా పోలీసులు లేకపోవడంతో అధికారులు అక్కడి నుంచి వెనుదిరిగారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆర్ ప్రవీణ్ చెప్పారు.



అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లను పరిశీలిస్తున్న ఆర్ఐ ప్రవీణ్

అనధికారిక నిర్మాణాలు తొలగింపు

భీమునిపట్నం : పట్టణంలోని మెయిన్ రోడ్డులో వున్న మునిసిపల్ లాల్‌బహదూర్‌శాస్త్రి మార్కెట్‌లో ఉన్న అనధికార దుకాణాలు, షెడ్లను జీవీఎంసీ పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు బుధవారం తొలగించారు. మునిసిపల్ మార్కెట్ పునర్నిర్మాణానికి జీవీఎంసీ రూ. 3 కోట్లు విడుదల చేసింది. దీంతో పునర్నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. అయితే ఇక్కడ మార్కెట్‌ను ఆనుకుని టీఎస్ నంబరు 996లో మార్కెట్ స్థలాన్ని కొందరు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేసి ఎంతోకాలంగా వ్యాపారాలు చేస్తున్నారు. దీనివల్ల మార్కెట్ పునర్నిర్మాణ పనులకు ఇబ్బంది కలుగుతుందని ఇంజనీరింగ్ అధికారులు కమిషనరుకు ఫిర్యాదు చేయడంతో ఆయన పరిశీలించి దుకాణాలను తొలగించాలని జోనల్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు జడ్సీ కనకమహాలక్ష్మి పర్యవేక్షణలో ప్రణాళికా విభాగం అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బంది దుకాణాలు తొలగించారు.



జన సంచారం లేని చిన్న బజారు, దొర తోట రోడ్డు

ఎండల తీవ్రతతో నిర్మానుష్యంగా రోడ్లు

భీమునిపట్నం, మే 22 : ఎండల తీవ్రతకు పట్టణంలోని రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఉదయం 6 గంటల నుంచే సూర్యుడు చుర్రుమనిపిస్తుండడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే బయపడుతున్నారు. తెల్లవారుజామున బజారు పనులు చూసుకుని ఇంటి ముఖం పడుతున్నారు. ఉదయం 11 తరువాత రహదారులన్నీ జన సంచారం లేక బోసిపోతున్నాయి. ఒకపక్క ఎండల తీవ్రత, మరోపక్క ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. వేడిగాలులకు చిన్నారులు, వృద్ధులు ఆపసోపాలు పడుతున్నారు.



ఉదయం 11 గంటలకు నిర్మానుష్యంగా ఉన్న బీచ్‌కు వెళ్లే రోడ్డు

గంటాను కలిసిన ఆరో వార్డు నాయకులు



గంటాను సత్కరిస్తున్న పోతిన శివ, పక్కన కోరాడ రాజబాబు కూడా ఉన్నారు

కొమ్మాది, మే 22 : భీమిలి కూటమి అభ్యర్థి గంటా శ్రీనివాసరావు, ఉండి అభ్యర్థి రఘురామకృష్ణంరాజును ఆరో వార్డు టీడీపీ నాయకులు బుధవారం ఎంవీపీ కాలనీలోని గంటా నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు పోతిన శివ మాట్లాడుతూ భీమిలి నియోజకవర్గం నుంచి గంటా భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగోతి శివాజీ, పోతిన ఎల్లంనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఏయూను సందర్శించిన అటవీ శాఖాధికారి



చిరంజీవి చౌదరికి జ్ఞాపిక అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

వెంకోజీపాలెం, మే 22 : ఏయూను రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు చిరంజీవి చౌదరి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డితో ఆయన కార్యాలయంలో భేటీ అయ్యారు. వర్సిటీలో జరిగిన అభివృద్ధి, వర్సిటీ నలుమూలల స్థాపించిన టెక్, ఫార్మా, ఫుడ్, మెరైన్, ఇంకు బేషన్ కేంద్రాల పనితీరు, ప్రగతిని వీసీ వివరించారు. అనంతరం ఏయూ తరపున చిరంజీవి చౌదరిని వీసీ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ బయో డైవర్సిటీ బోర్డు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



బయో డైవర్సిటీ కేంద్రంలో సందర్శకులతో పర్యాటక, అటవీశాఖ అధికారులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఎంవీపీ కాలనీ, మే 22 : పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని జిల్లా పర్యాటక శాఖాధికారిణి జ్ఞానవేణి అన్నారు. జూపార్కు సమీపంలో అటవీ శాఖ నిర్వహిస్తున్న బయో డైవర్సిటీ కేంద్రంలో బుధవారం అంతర్జాతీయ బయో డైవర్సిటీ దినోత్సవం సందర్భంగా సందర్శకులకు అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నగరంలోని వివిధ పర్యాటక కేంద్రాలు, ఇకో టూరిజం వంటి అంశాలపై సందర్శకులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం కోఆర్డినేటర్ ప్రణవ్, కన్సల్టెంట్ సందీప్, ఔషధ వనం, నక్షత్ర వనం ఇన్‌చార్జి యజ్ఞపతి, తదితరులు పాల్గొన్నారు.

పనులను వేగవంతం చేయండి : కమిషనర్

కొమ్మాది, మే 22 : జోన్ 2 కార్యాలయం పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కమిషనర్ సాయికాంత్ వర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన జోన్-2 కార్యాలయాన్ని సందర్శించి పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయం మొత్తం ఆకర్షణీయమైన రంగులు వేయించాలని, ఫర్నీచర్, విద్యుత్ కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అలాగే కార్యాలయాన్ని ఆనుకుని ఉన్న సౌకర్యం కేంద్రం నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆయన ఐటీ సెజ్ వద్ద పార్కు సమీపంలో నిర్మిస్తున్న టెన్నిస్ కోర్టు పనులను పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఎస్ఈ శ్యామ్ సన్‌రాజు, కార్యనిర్వాహక ఇంజనీర్ శాంతిరాజును ఆదేశించారు. ఐటీ సెజ్ రోడ్డులో ఉన్న అనధికార దుకాణాలను తొలగించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీ హెచ్. సురేష్, ఏఎం హెచ్ఓ కిషోర్, డీఈ వంశీ, ఏడీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



కార్యాలయం పనులను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ

చిరు ధాన్యాలతో బుద్ధుడి చిత్రపటం



చిత్రపటాన్ని ఆవిష్కరించిన బౌద్ధ భిక్షువులు

వెంకోజీపాలెం, మే 22 : బుద్ధపూర్ణిమ పురస్కరించుకుని నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ ప్రత్యేకంగా మిల్లెట్స్ ఉపయోగించి బుద్ధుడి చిత్రపటాన్ని తీర్చిదిద్దారు. నాలుగు అడుగుల ఎత్తు, మూడు అడుగుల వెడల్పు కలిగిన ఈ చిత్రపటాన్ని కేవలం మిల్లెట్స్ ఉపయోగించి 20 రోజులు శ్రమించి తయారు చేశారు. బుధవారం ఏయూ అంతర్జాతీయ విద్యార్థినుల వసతి గృహంలో బౌద్ధ భిక్షువులు దీన్ని ఆవిష్కరించారు. అనంతరం బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు చేసి, చిత్రకారుడు విజయ్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్స్ చీఫ్ వార్డెన్ ఆచార్య ఈశ్వర్ కుమార్, మహిళా హాస్టల్ వార్డెన్ డాక్టర్ కె. రాజమాణిక్యం, తదితరులు పాల్గొన్నారు.

గెద్దపేటలో ఘనంగా రాజ్యలక్ష్మి అమ్మవారి తొలేళ్లు

పద్మనాభం, మే 22 : కోరాడ పంచాయతీ గెద్దపేటలో రాజ్యలక్ష్మి అమ్మవారి తొలేళ్ల ఉత్సవం బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారి ఆలయంలోను, చదురుగుడి వద్ద పూజలు జరిపారు. అమ్మవారి ఘటాలను డప్పు వాయిద్యాల నడుమ ప్రధాన వీధుల్లో ఊరేగించారు.